www.visalaandhra.com

శుక్రవారం
05-07-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 73, సంచిక : 14
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఈయూ కొత్త అధ్యక్షుడికి జిన్‌పింగ్ శుభాకాంక్షలు

బీజింగ్: యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడిగా ఆంటోనియో కోస్టా ఎన్నికయ్యారు. ఆయనకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో యూరోపియన్ యూనియన్‌కు ప్రాధాన్యత ఉందని, చైనా-ఈయూ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునేందుకు కట్టుబడి ఉన్నామని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, ఈయూ మధ్య బంధానికి విలువ ఇస్తానని చెప్పారు. చైనా, ఈయూ భాగస్వామ్యం మరింత బలోపేతమయ్యేందుకు కోస్టాతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధంగా ఉందని జిన్‌పింగ్ తెలిపారు. అనేక రంగాల్లో సహకారాన్ని, రాజకీయ నమ్మకాన్ని పెంపొందించుకుందామని, ప్రపంచ శాంతి, అభివృద్ధికి నూతన తోడ్పాటు అందిద్దామని కోస్టానుద్దేశించి జిన్‌పింగ్ అన్నారు.

విద్యాసంస్థల బంద్
విజయవంతం

- విద్యార్థి నాయకులపై పోలీస్ జులుం
- విజయవాడలో అక్రమ అరెస్టులు...విద్యార్థి సంఘాల నిరసన
- 'నీట్' రద్దు చేయాలని కదం తొక్కిన విద్యార్థులు

విశాలాంధ్ర - విజయవాడ/గుంటూరు: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకవడంతో పాటు అనేక అక్రమాలు జరిగిన నేపథ్యంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌బి, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ తదితర విద్యార్థి సంఘాల పిలుపు మేరకు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు మూతపడ్డాయి. విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కాగా విజయవాడలో విద్యార్థి నాయకుల అరెస్టు ఉద్రిక్తతకు దారి తీసింది. శాంతియుతంగా నిర్వహిస్తున్న బంద్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. మొగల్రాజపురం సిద్దార్థ కళాశాల వద్ద నిరసన కార్యక్రమంలో ప్రసంగించకుండా విద్యార్థి నాయకులను అడ్డుకున్నారు. ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో ఎక్కించి మాచవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరిపై అక్రమంగా 170 బీఎన్ఎస్ అనే కొత్త చట్టం కింద కేసులు నమోదు చేశారు. నీట్, నెట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని, అసమర్థ ఎన్‌టీఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఎల్ కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన సంగతి విదితమే. విజయవాడలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నీట్, నెట్ పేపర్

- మిగతా 2 లో

ఏపీని ఆదుకోండి

- కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించండి
- ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వినతి
- అమిత్‌షా సహా వివిధ కేంద్రమంత్రులతో వరుస భేటీలు
- నేడు మరికొందరు మంత్రులతో సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్థికంగా నష్టపోయి, అప్పుల్లో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా ఆదుకోవాలని ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈనెల చివరిలో కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుండటంతో శాఖల వారీ కేటాయింపుల లక్ష్యంతో బుధవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి గురువారం బిజీబిజీగా గడిపారు. ఉదయం 10.15 గంటలకు ప్రధానితో భేటీ అయి రాష్ట్ర అవసరాలను వివరించారు. ఆర్థిక సాయం సహా రాష్ట్ర పునర్‌నిర్మాణానికి సహకారాన్ని కోరారు. గత ప్రభుత్వ విధ్వంసకర చర్యలతో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. మౌలిక వసతుల కల్పన, అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తికి తోడ్పాటును కోరారు. రాష్ట్రానికి అత్యంత కీలకమైన పోలవరం, అమరావతి ప్రాజెక్టుల నాశనం వల్ల ఏపీకి కోలుకోలేనంత నష్టం జరిగిందన్నారు. అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణంతో పాటు కీలక రహదారులకు మరమ్మతులు, పట్టణ, గ్రామీణ పేదలకు ఇళ్లు, జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా వంటి ముఖ్యాంశాలపై ప్రధానికి విజ్ఞప్తులు చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతోనూ భేటీ అయిన పెండింగ్‌లో ఉన్న విభజనాంశాలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.

విజయవాడలో నిడమానూరు ఫ్లైఓవర్ పొడిగింపుకు గడ్కరి హామీ

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో భేటీ సందర్భంగా అనంతపురం-అమరావతి ఎక్స్‌ప్రెస్ హైవే, విజయవాడ తూర్పు బైపాస్ రోడ్డు, రాజధాని అవుటర్ రింగ్ రోడ్డు, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ దగ్గర నుంచి నిడమానూరు వరకు

- మిగతా 2 లో

పదిహేడేళ్ల ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఐసీసీ టీ20 ప్రపంచకప్ సాధించి విశ్వవేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేసిన టీమిండియా గురువారం స్వదేశానికి చేరుకుంది. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన రోహిత్ సేన... సాయంత్రం ముంబై చేరుకుంది. మెరైన్ రోడ్డులో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ప్రపంచ కప్ గెలిచిన భారత ఆటగాళ్లు పాల్గొన్నారు. ప్రపంచకప్ విజేతలు ఓపెన్ టాప్ బస్‌లో నిల్చుని రోడ్ షోలో సందడి చేశారు. లక్షలమంది అభిమానుల నీరాజనాల నడుమ ప్రపంచకప్ ట్రోఫీని అభిమానులకు చూపుతూ ముందుకు సాగారు. నారీమన్ పాయింట్ నుంచి వాంఖడె స్టేడియం వరకు ఈ రోడ్ షో సుమారు గంటన్నరపాటు సాగింది.

అగ్నివీర్‌పై కేంద్రానివి
అర్ధసత్యాలు

- అజయ్ కుమార్ కుటుంబానికి ఇచ్చినది బీమా డబ్బు... పరిహారం కాదు
- తప్పుదోవ పట్టించేలా సర్కార్ వ్యాఖ్యలు
- వత్తాసు పలికిన సైన్యం

2లో

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీరుడు అజయ్ కుమార్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇచ్చినట్లు కేంద్రప్రభుత్వం పార్లమెంటు సాక్షిగా దేశాన్ని తప్పుదోవ పట్టించింది. అర్ధసత్యాలు పలికింది. సైన్యం కూడా వత్తాసు పలికింది. అజయ్ కుమార్ కుటుంబానికి ఇచ్చినది బీమా డబ్బు తప్ప పరిహారం కాదని నిజనిర్ధారణ జరిగింది.

ముప్పతిప్పలు!

- ఏపీ టెట్‌కు జిల్లాలు దాటి పరీక్షా కేంద్రాలు
- ఒక్కో అభ్యర్థికి ఐదు ఆప్షన్లు
- ప్రాధాన్యతగా కేటాయింపు నిబంధన
- దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- సొంత జిల్లాల్లోనే పరీక్షలు... లోకేశ్‌కు వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ (జులై, 2024)కు ఒక్కో అభ్యర్థికి జిల్లాలు దాటి ఐదు పరీక్షా కేంద్రాలను ఆప్షన్లుగా ఎంచుకోవాలన్న నిబంధన విధించడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ ఆప్షన్లలో ఉమ్మడి 13 జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌ను అందుబాటులో ఉంచారు. ఉదాహరణకు ఉమ్మడి కృష్ణాజిల్లా విజయవాడకు చెందిన ఒక అభ్యర్థి దరఖాస్తు చేసే ప్రక్రియలో భాగంగా ఐదు జిల్లాలను ఖచ్చితంగా ఎంచుకోవాల్సిందిగా ఆప్షన్లు సూచిస్తున్నాయి. టెట్ దరఖాస్తుల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈనెల మూడో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఫీజులు చెల్లించిన అభ్యర్థులు జిల్లాల వారీగా టెట్‌కు దరఖాస్తు చేస్తున్నారు. తొలి రోజు నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులు తమ పేపర్ల వారీగా దరఖాస్తు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందనని వారు... మొదటగా కృష్ణాజిల్లా పెట్టుకోగా, ఆ తర్వాత గుంటూరు, ప్రకాశం, రాజమహేంద్రవరం, నెల్లూరు ఇలా కొద్దిగా దగ్గరగా ఉన్న జిల్లాలతో ప్రాధాన్యతా క్రమంలో ఆప్షన్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. దీంతో ముందు వరుసలో దరఖాస్తు చేసిన వారికే సొంత జిల్లాలో పరీక్షా కేంద్రం పడుతుందా?, ఆలస్యం చేస్తే ఇతర జిల్లాలకు తరలిపోతారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీ టెట్-2022, 2024 (ఫిబ్రవరి) పరీక్షల నిర్వహణలోను

- మిగతా 2 లో

సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్

మూడవసారి బాధ్యతలు

రాంచీ: జార్ఖండ్ 13వ ముఖ్యమంత్రిగా జేఎంఎం కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ గురువారం రాజ్ భవన్‌లో సోరెన్‌తో ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి సోరెన్ కుటుంబ సభ్యులతో పాటు జేఎంఎం నేతృత్వ కూటమి సీనియర్ నాయకులు హాజరయ్యారు. మనీల్యాండరింగ్ కేసులో అరెస్టయిన హేమంత్ సోరెన్‌కు హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయన మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంపై సోరెన్ రాజీనామాతో హేమంత్ సోరెన్‌కు మార్గం సుగమమైంది. గవర్నర్‌ను కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కోరుతూ, సంబంధిత మద్దతు లేఖను ఆయన సమర్పించారు. గవర్నర్

- మిగతా 2 లో

బ్రిటన్ పోరు రసవత్తరం 2లో

ఇదీ లోకం!

పిన్నెల్లి అరెస్టు అన్యాయం

వైసీపీ అధినేత జగన్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు : రాష్ట్రంలో విధ్వంస రాజకీయాలకు పాల్పడుతూ విష సంస్కృతికి చంద్రబాబు బీజం వేస్తున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. వైసీపీ నాయకులు, మద్దతుదారుల ఆస్తుల్ని ధ్వంసం చేయడమేగాక తిరిగి బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టడం ఎంత మాత్రం న్యాయం కాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై, మంచి పాలన అందించడంలో చంద్రబాబు దృష్టిపెడితే మంచిదని హెచ్చరించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని వైఎస్ జగన్ గురువారం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేవలం తెలుగుదేశం పార్టీకి ఓటు వేయలేదన్న కారణంతో ఏకంగా ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, దొంగ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. గత 5 సంవత్సరాల వైసీపీ పాలనలో పార్టీలకు అతీతంగా ప్రతి పథకం, ప్రతి మంచీ కూడా అర్హత గల అందరికీ అందించామని తెలిపారు. ఈరోజు చంద్రబాబు నాయుడుకు ఓటు వేయలేదనే కారణంతో ప్రజల ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను విరగ్గొడుతున్నారని మండిపడ్డారు. ఇవన్నీ శిశుపాలుని పాపాల మాదిరిగా పండుతాయని హెచ్చరించారు. ప్రజలు టీడీపీకి ఎందుకు ఓటు వేశారో చంద్రబాబు ఆలోచించాలన్నారు. ప్రజలకు మంచి చేసి కూడా వైసీపీ ఓడిపోయిందని జగన్ అన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు ప్రజలు కాస్తో కూస్తో ఆకర్షితులై 10 శాతం ఓట్లు అటు వైపు వెళ్లి చంద్రబాబు నాయుడు అధికారంలోకి

- మిగతా 2 లో

బ్రిటన్ పోరు రసవత్తరం

రిషి సునాక్, కైర్ స్టార్మర్ మధ్య హోరాహోరీ

లండన్: బ్రిటన్ సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ గురువారం మొదలైంది. ముందస్తు ఎన్నికలకు ప్రధాని రిషి సునాక్ వెళ్లిన విషయం తెలిసిందే. రిషి సునాక్‌కు, లేబర్ పార్టీ నేత కైర్ స్టార్మర్‌కు మధ్య హోరాహోరీ కొనసాగుతోంది. బ్రిటన్, ఇంగ్లండ్, నార్తెన్ ఐర్లాండ్, స్కాట్లాండ్, వేల్స్‌లో పోలింగ్ జరుగుతుంది. 650 స్థానాలకు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. ఈసారి ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరు గుర్తింపు కార్డును చూపించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. ఇమ్మిగ్రేషన్ ఉన్న వారికీ ఓటు హక్కు వచ్చింది. 18 లక్షల మంది భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు మొదలవుతుంది.

స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్రానికి ఫలితాలను ప్రకటిస్తారు. బ్రిటన్ వ్యాప్తంగా 40 వేల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చర్చి హాల్స్, కమ్యూనిటీ సెంటర్లు, స్కూళ్లతో పాటు పబ్‌లు, షిప్‌ల్లోనూ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 46.5 మిలియన్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారు. బ్రిటన్‌లో గుర్తింపు పొందిన పార్టీలు మొత్తం 392 ఉన్నాయి. అయితే కన్జర్వేటివ్, లేబర్ పార్టీల మధ్య ప్రధానంగా పోరు సాగుతుంది. 15 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న లేబర్ పార్టీ ఈసారి గెలుపు దీమాతో ఉంది. ప్రీ పోల్ సర్వేలు సైతం ఈ పార్టీకి అనుకూలంగా వెలువడ్డాయి. కాగా, 2019లో బోరిస్ జాన్సన్ నాయకత్వంలో కన్జర్వేటివ్ పార్టీ భారీ విజయాన్ని అందుకుంది.

2025లో చైనాలో ఎస్‌సీఓ సదస్సు

అస్తానా: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సభ్యదేశాల తదుపరి సమావేశం 2025లో చైనాలో జరగబోతోంది. సంస్థ చైర్మన్‌షిప్‌ను చైనా చేపట్టనుంది. ఈ మేరకు ఎస్‌సీఓ ఆస్తానా తీర్మానం పేర్కొంది. ఎస్‌సీఓ సుస్థిరాభివృద్ధి వత్సరంగా 2025ను ప్రకటించాలని సభ్యదేశాలు అంగీకరించాయి. కజకస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానం జరిగింది. ఇదే సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. చైనా-రష్యా సంబంధాలు మరింత బలపడినట్లు పుతిన్ అన్నారు. సంస్థాగత పనిలో ఎస్‌సీఓ సభ్యదేశాల భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, ఎస్‌సీఓ ప్రాదేశిక ఉగ్రవాద వ్యతిరేక వ్యవస్థను సంస్కరించుకోవాలని పుతిన్ సూచించారు.

సభ్యదేశంగా బెలారస్

బెలారస్ పూరిస్థాయిలో ఎస్‌సీఓ సభ్యదేశమైంది. సంబంధిత పత్రాలపై అస్తానా సదస్సులో భాగంగా సంతకాలు జరిగాయి. ఎస్‌సీఓకు అధ్యక్షత వహిస్తున్న కజక్ అధ్యక్షుడు ఖాసిం జోమార్ట్ ఈ మేరకు ప్రకటించారు. ఎస్‌సీఓ 2001లో ఏర్పడింది. భారత్, ఇరాన్, కజకస్థాన్, చైనా, కిర్గిస్థాన్, రష్యా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్ సభ్యదేశాల సరసకు బెలారస్ చేరింది. అనేక దేశాలు పరిశీలకుల పాత్ర పోషిస్తుండటం విదితమే.

200 రాకెట్లతో ఇజ్రాయిల్‌పై హెజ్బుల్లా ప్రతీకార దాడి

బీరుట్: తమ సీనియర్ కమాండర్లలో ఒకరిని హతమార్చిన ఇజ్రాయిల్‌పై 200కుపైగా క్షిపణులతో లెబనాన్‌లోని హెజ్బుల్లా సంఘం విరుచుకుపడింది. తమ సైన్యాధికారి మృతికి ప్రతీకారంగా సైనిక స్థావరాలే లక్ష్యంగా యూద దేశంపై దాడి చేసింది. లెబనాన్-ఇజ్రాయిల్ సరిహద్దు వెంబడి చాలా నెలలుగా సాగుతున్న పోరులో ఇంత పెద్దఎత్తున దాడి చేయడం ఇదే మొదటిసారి. కత్యుషా, ఫలక్ రాకెట్లను హెజ్బుల్లా ప్రయోగించింది. విస్ఫోటన డ్రోన్లను స్థావరాలపైకి పంపింది. ఇదిలావుంటే, లెబనాన్ వైపు నుంచి తమ దేశంపై దాడి జరిగినట్లు ఇజ్రాయిల్ సైతం తెలిపింది. అనేక ప్రొజెక్టైళ్లు (ప్రక్షేపకాల), అనుమానద వస్తులు తమ గగనతలంలోకి ప్రవేశించినట్లు పేర్కొంది. ఈ దాడిని ప్రతిఘటించినట్లు వెల్లడించింది. అనుమానస్పద వస్తువులను గాల్లోనే ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ప్రాణ నష్టం జరిగిన దాఖలు లేనట్లు తెలిపింది. హెజ్బుల్లాకు చెందిన మూడు ప్రాంతీయ విభాగాధిపతి మహమ్మద్ నమేహ్ నసీర్‌ను హతమార్చినట్లు అంగీకరించింది.

సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు హేమంత్ సోరెన్‌ను ఆహ్వానించారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టగలిగారు.

నిబద్ధతతో పనిచేస్తా...

ప్రజాదరణ, కోర్టు తీర్పుతో జైలు నుంచి బయటకు రాగలిగానని, ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో నడిపిస్తానని, సమర్థ సేవలు అందిస్తానని, నిబద్ధతతో పనిచేస్తానని హేమంత్ సోరెన్ హామీనిచ్చారు. ప్రమాణ స్వీకారం తర్వాత మాట్లాడిన ఆయన... తన అరెస్టు తర్వాత రాష్ట్ర పగ్గాలు చేపట్టిన చంపై సోరెన్‌ను ప్రశంసించారు. విధి ధర్మానానికి కట్టుబడ్డారని, సమర్థంగా పనిచేశారంటూ అభినందించారు. చంపై సోరెన్ కూడా హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే క్రమంలో ప్రజలకు హేమంత్ ఒక వీడియో సందేశమిచ్చారు. తనపై జరిగిన కుట్ర, ఐదు నెలలు జైల్లో ఉండటం గురించి మాట్లాడారు. 'జనవరి 31న నన్ను అరెస్టు చేశారు. నాపై జరిగిన కుట్ర గురించి మీకు తెలుసు. నన్ను జైలుకు పరిమితం చేయాలని చూశారు కానీ న్యాయ పోరాటం చేయాలని నేను నిర్ణయించుకున్నా. వీధుల్లోకి వచ్చి మీరు కూడా మద్దతిచ్చారు. చివరకు న్యాయం జరిగింది. నాపై ఆరోపణలు కొట్టివేశారు' అని హేమంత్ సోరెన్ అన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే: కల్పన

హేమంత్ సోరెన్ భార్య, జేఎంఎం శాసనసభ్యురాలు కల్పనా సోరెన్ మాట్లాడుతూ హేమంత్ సోరెన్ తిరిగి ముఖ్యమంత్రి పీఠాన్ని అధీష్టించగలగడం ప్రజలు, పార్టీ కార్యకర్తల ఆశీర్వాదంతోనే సాధ్యమైందని చెప్పారు. 'హైకోర్టు ఇచ్చిన తీర్పు వల్ల బయటకు రాగలి సీఎం పగ్గాలను హేమంత్ సోరెన్ చేపట్టగలిగారు. ఎక్కువ సమయం లేదు కాబట్టి మునుపటి కంటే మెరుగైన పాలనను అందించేందుకు కృషి చేస్తారు' అని కల్పన అన్నారు.

జేఎంఎం సారథ్యంలోని ఇండియా ఐక్య సంఘటన ఎమ్మెల్యేలంతా చంపై సోరెన్ నివాసంలో బుధవారం సమావేశమై హేమంత్ సోరెన్‌ను శాసన సభాపక్ష నేతగా ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఈనెల 7న ప్రమాణ స్వీకారం జరుగుతుందని జేఎంఎం తొలుత ప్రకటించింది కానీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ సెప్టెంబరులో వెలువడే అవకాశం ఉన్నందున నిర్ణయం మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇక హేమంత్ సోరెన్ కేబినెట్‌పై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం జరగలేదు. కాంగ్రెస్ జార్ఖండ్ ఇన్‌చార్జి గులాం అహ్మద్ మీర్ మాట్లాడుతూ తమ పార్టీ తరపున కేబినెట్‌లో ఎవరుండానేది అధిష్ఠానమే నిర్ణయిస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 14 పార్లమెంటు స్థానాలలో తొమ్మిది ఎన్డీయే గెలిచింది. ఇండియా ఐక్య సంఘటన ఐదు స్థానాలకు పరిమితమైంది. అయితే అసెంబ్లీ ఉప-ఎన్నికల్లో జేఎంఎం సత్తా చాటింది. గాండే స్థానం నుంచి కల్పనా సోరెన్ ఎన్నికయ్యారు. హేమంత్ సోరెన్ కేసులో హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని ఈడీ భావిస్తున్నట్లు సమాచారం. భూకుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలతో హేమంత్ సోరెన్‌ను నాటకీయ పరిణామాల నడుమ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడం విదితమే.

8న బలపరీక్ష

హమంత్ సోరెన్ అధ్వర్యంలో నూతనంగా ఏర్పాటైన జార్ఖండ్ ప్రభుత్వం ఈనెల 8న బలపరీక్షను ఎదుర్కోబోతోంది. జార్ఖండ్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా తన బలాన్ని నిరూపించుకునేందుకు సోరెన్ సర్కార్ సిద్ధమెనట్లు జేఎంఎం వర్గాలు వెల్లడించాయి. గెలుపుపై దీమా వ్యక్తంచేశాయి.

ముప్పతిప్పలు!

(మొదటిపేజీ తరువాయి)

ఇదే తప్పిదం చేశారన్న విమర్శలున్నాయి. వేలాది మంది అభ్యర్థులకు జిల్లాలు దాటి నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నంలాంటి దూర ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను కేటాయించారు. కృష్ణాజిల్లాకు చెందిన అభ్యర్థి నెల్లూరు వెళ్లి రాయాలంటే ముప్పుతిప్పలు పడాల్సి ఉంటుంది. ఒక రోజు ముందే పరీక్షా కేంద్రం ఉన్న నగరానికి చేరుకుని, ఏదొక హోటల్‌లో బసచేసి, మరుసటి రోజు చేరుకోవాలి. అధిక దూరం ప్రయాణంతో అభ్యర్థులు అలసిపోయి...పరీక్షపై పూర్తిగా దృష్టి పెట్టలేరు. ప్రధానంగా ఏపీ టెట్ (తెలుగు) పేపర్-2 అభ్యర్థులు అందరినీ నెల్లూరు వేయడంతో నానా పాట్లు పడ్డారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా ఎంతోమంది నెల్లూరుకు తరలివచ్చారు. ఇప్పుడు కూడా పరీక్షా కేంద్రాలకు ఐదు జిల్లాల ఆప్షన్లను ప్రాధాన్యతా క్రమంలో ఎంచుకోవాలని సూచించడంతో అభ్యర్థులు గందరగోళానికి గురవుతున్నారు. ఈ నెల రెండో తేదీన పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ నోటిఫికేషన్ జారీజేశారు. మూడో తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అభ్యర్థులు ఫీజు చెల్లించాలి. 17వ తేదీ వరకు దరఖాస్తు చేసేందుకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్ షెడ్యూలు ఆధారంగా ఆగస్టు ఐదోతేదీ నుంచి 20వ తేదీ వరకు పేపర్ 1ఏ, పేపర్ 1బీ, పేపర్ 2ఏ, పేపర్ 2బీ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలను ఆగస్టు 30న ప్రకటిస్తారు. పరీక్షా కేంద్రాలను జిల్లాలు దాటించే విధానానికి స్వస్తి చెప్పాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అభ్యర్థులు విన్నవిస్తున్నారు. సొంత జిల్లాల్లోనే పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అర్హత వివరాలు పొందుపర్చాలి

ఏపీ టెట్ (జులై, 2024)కు దరఖాస్తు చేసే అభ్యర్థులందరూ. గత టెట్‌లో అర్హత సాధించి ఉంటే వాటి వివరాలను తప్పనిసరిగా పొందుపరచాలని సూచిస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రూపొందించిన వెబ్‌సైట్‌లో గత టెట్‌ల ఫలితాల సమాచారం ఆలస్యంగా అందుబాటులోకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టెట్ 2011లో ప్రారంభమైంది. ఆ తర్వాత 2014 నుంచి 2022, 2024 (ఫిబ్రవరి) వరకు జరిగిన టెట్‌లలో వరుస వారీగా అభ్యర్థులు అర్హత సాధించారు. ప్రస్తుత టెట్ దరఖాస్తులో అభ్యర్థులు ఎన్ని సార్లు అర్హత సాధించి ఉంటే... వారి హాల్ టిక్కెట్ల నంబర్లు, టెట్ నిర్వహించిన సంవత్సరం వివరాలను నమోదు చేయమంటున్నారు. ఈ సమాచారం అభ్యర్థుల దగ్గర లేకపోవడంతో తికమకపడుతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యాశాఖ ఏపీ టెట్- (జులై) 2024 వెబ్‌సైట్‌లో పూర్వపు టెట్ మార్కులను అందుబాటులో ఉంచారు.

అగ్నివీర్‌పై కేంద్రానివి అర్ధసత్యాలు

న్యూఢిల్లీ:

పార్లమెంటులో అగ్నివీర్ పథకం మీద అధికార, విపక్షాల మధ్య వాడీవేడీ చర్చ సాగింది. అగ్నివీరులను సైనికులుగా పరిగణించడం లేదని, సైన్యానికి వ్యతిరేకమైన ఈ పథకాన్ని రద్దు చేయాలని విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. అమర జవానుకు రూ.కోటి పరిహారం చెల్లించినట్లు కేంద్రం తరపున రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఈ వివాదం సామాజిక మాధ్యమాల్లోనూ సాగింది. సైన్యం స్పందించేలా చేసింది. జనవరి 18న జమ్మూకశ్మీర్‌లో మందుపాతర పేలి అగ్నివీర్ అజయ్ కుమార్ అమరుడయ్యారు. అనంతరం ఆయన కుటుంబానికి కొంత డబ్బు అందింది. అది ప్రభుత్వ పరిహారమా లేక బీమా డబ్బా అన్నది ఆసక్తికరంగా మారింది. దీంతో నిజనిర్ధారణ జరిగింది.

అగ్నివీరుడి కుటుంబానికి రూ.కోటి చెల్లించినట్లు కేంద్రప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని వెల్లడైంది. కోటి రూపాయలు ఆ కుటుంబానికి అందాయి కానీ అవి అమర సైనికులకు ఇచ్చే బీమా మొత్తమని తేలింది. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయే సైనికులకు ఇచ్చే ప్రయోజనాలు అగ్నివీరులకు ఉండవు. అగ్నివీర్ కుటుంబానికి చెల్లింపులపై సైన్యం వివరణను బట్టి రూ.50లక్షలను ఎస్‌బీఐ బ్యాంకు చెల్లించిందని వెల్లడైంది. ఇంకో రూ.39వేలను సైన్యం చెల్లించిందని తెలిసింది. సైనిక సంక్షేమ నిధి నుంచి ఇవ్వాల్సిన రూ.8లక్షలతో పాటు పరిహార మొత్తం రూ.44 లక్షలను ఇంకా చెల్లించలేదు. అలాగే ఒప్పందం ప్రకారం కాంట్రిబ్యూటరీ సేవా నిధి నుంచి రూ.2.3లక్షలను ఆర్మీ చెల్లించాల్సి ఉంది. ఇక 'బ్యాలెన్స్ ఆఫ్ పే' కింద మరో రూ.13లక్షలు కూడా ఆ కుటుంబానికి ఇవ్వలేదు. బీమా మొత్తాన్ని పరిహారంగా చూపే ప్రయత్నాన్ని చేయడం ద్వారా సభను తప్పుదోవ పట్టించేందుకు ప్రభుత్వం, సైన్యం యత్నించినట్లు నిజ నిర్ధారణ ద్వారా తేలింది.

సైన్యం వివరణ

అగ్నివీర్ అజయ్ కుటుంబానికి రూ.98.39లక్షలను ఇప్పటికే చెల్లించినట్లు భారత సైన్యం అధికార ప్రతినిధి 'ఎక్స్'లో వివరణ ఇచ్చారు. పరిహారం, ఇతర ప్రయోజనాలకు సంబంధించి రూ.67లక్షలు ఇవ్వాల్సి ఉందని, దానిని పోలీసు వెరిఫికేషన్ తర్వాత చెల్లిస్తామని చెప్పారు. మొత్తంగా రూ.1.65కోట్లు ఆ కుటుంబానికి అందుతాయన్నారు. అయితే ఈ మొత్తాన్ని ఎక్కడ కూడా 'బీమా'గా వ్యవహరించకపోవడం గమనార్హం.

ప్రభుత్వం, సైన్యం తీరు సరి కాదు: కల్నల్ అమిత్ కుమార్

అజయ్ కుమార్ కుటుంబానికి ఇచ్చినది బీమా డబ్బు తప్ప ప్రభుత్వ పరిహారం కాదని ఆర్మీ సీనియర్ కల్నల్ అమిత్ కుమార్ 'ఎక్స్' ద్వారా స్పష్టంచేశారు. ఆ డబ్బును తామిచ్చినట్లుగా సైన్యంగానీ ప్రభుత్వంగానీ చెప్పుకోవడం సరికాదన్నారు.

'రక్షణ మంత్రి స్థూలంగా రూ.కోటి అని చెప్పారు, ఇందులో రూ.48లక్షలు బీమా డబ్బు. బీమా డబ్బును ప్రభుత్వమిచ్చే పరిహారం కింద జమచేయలేము. అవార్డు లేక రివార్డుగా పరిగణించలేము' అని ఆయన పేర్కొన్నారు. 'ఓ సైనికుడి జీతాన్ని అగ్నివీర్‌కు ఇచ్చేదానితో పోల్చి నిజమేమిటో మీకే తెలుస్తుందని వ్యాఖ్యానించారు. 'సమాన పనికి సమాన వేతనం ఉండాలి. ముఖ్యంగా ప్రమాదం సామానస్థాయిలో ఉన్నప్పుడు' అంటూ కల్నల్ అమిత్ కుమార్ ట్వీట్ చేశారు. ఇదిలావుంటే, రూ.50లక్షలు ఎస్‌బీఐ ఇచ్చింది. ఎస్‌బీఐలో వేతన ఖాతాలుగల ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఉండే గ్రూపు ఇన్సూరెన్స్ కింద ఈ మొత్తాన్ని అందించింది. మరో రూ.48లక్షలు ఆర్మీ గ్రూప్ బీమా ద్వారా వచ్చాయి' అని ఎక్స్ వినియోగదారు ఒకరు వివరించారు. సైన్యం రూ.38వేలు ఇచ్చిందని, మిగతాది ప్రభుత్వ బీమా, బ్యాంకు బీమా మొత్తమన్నారు. పరిహారం రూపేణ రూ.44లక్షలు, ఆర్మీ సంక్షేమ నిధి నుంచి రూ.8లక్షలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఒప్పందం ప్రకారం అగ్నివీరుడికి రూ.13లక్షలు రావాలని, కాంట్రిబ్యూటరీ సేవ నిధి నుంచి రూ.2.3లక్షలను సైన్యం ఇవ్వాల్సి ఉందని నివేదికలు కూడా పేర్కొన్నాయి.

రాహుల్, రాజ్‌నాథ్ ఏమన్నారంటే...

జులై 1న రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞతా తీర్మానంపై చర్చలో భాగంగా అగ్నిపథ్ పథకాన్ని రాహుల్ గాంధీ ప్రస్తావించారు. సైనికులను వాడుకొని వదిలేసేలా ఈ పథకం ఉన్నదని విమర్శించారు. శాశ్వత సైనికుడు, తాత్కాలిక అగ్నివీరుడికి మధ్య వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు. రక్షణ మంత్రి జోక్యం చేసుకొని విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీరుల కుటుంబాలకు రూ.కోటి పరిహారాన్ని కేంద్రప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. రాహుల్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పార్లమెంటును తప్పుదోవ పట్టించే ప్రయత్నానికిగాను ఆయన క్షమాపణ చెప్పాలని అధికార పక్షం డిమాండ్ చేసింది. దీంతో ఇది రాజ్‌నాథ్ సింగ్ అభిప్రాయం... వాస్తవమేమిటో అగ్నివీరులకు తెలుసని ప్రతిపక్ష నేత దీటైన బదులిచ్చారు. అగ్నివీరులకు పరిహారం గురించి పార్లమెంటులో రక్షణ మంత్రి అబద్ధం చెప్పారంటూ రాహుల్ జులై 3న ఎక్స్‌లో వీడియో పెట్టారు. అజయ్ కుమార్ తండ్రి మాట్లాడుతున్న వీడియో క్లిప్‌ను పోస్టు చేశారు. పంజాబ్ ప్రభుత్వం నుంచి కొంత అందింది కానీ కేంద్రం నుంచి ఏమీ లభించలేదని అజయ్ కుమార్ తండ్రి చెబుతుండటం అందులో ఉంది. లోక్‌సభలో రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలను ఖండిస్తూ మాకు ఎలాంటి సందేశంగానీ డబ్బుగానీ లభించలేదని కూడా ఆయన చెప్పారు.

ఏపీని ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఫ్లైఓవర్ పొడిగింపు వంటి అంశాలను చంద్రబాబు చర్చించారు. తూర్పు బైపాస్, నిడమానూరు వరకు ఫ్లైఓవర్ పొడిగింపుకు కేంద్రం పచ్చజెండా ఊపినట్లు తెలిసింది. కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, హరదీప్ సింగ్ పూరీ, మనోహర్ లాల్ ఖట్టర్, శివరాజ్ సింగ్ చౌహాన్, 16వ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ డాక్టర్ అరవింద పనగారియా తదితరులతోనూ చంద్రబాబు భేటీ అయ్యారు.

ఆయా శాఖల సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. చంద్రబాబు శుక్రవారం ఆర్థిక మంత్రి నిర్మలా శీతారామన్‌తో పాటు మరికొందరు మంత్రులతో సమావేశం కానున్నారు. చంద్రబాబు వెంట కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, బీసీ జనార్ధన్‌రెడ్డి ఉన్నారు.

గంజాయి నియంత్రణకు టాస్క్‌ఫోర్స్

- త్వరలో టోల్ ఫ్రీ నంబరు ప్రకటిస్తాం
- మంత్రులు అనిత, సంధ్యారాణి
- మంత్రివర్గ ఉప సంఘం తొలి భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించేందుకు 'యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రివర్గ ఉప సంఘం వెల్లడించింది. త్వరలో ఒక ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ప్రకటిస్తామని తెలిపింది. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం తొలి సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఉప సంఘం చర్చించింది. రాష్ట్ర హోమ్, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏర్పాటైన ఈ మంత్రివర్గ ఉప సంఘంలో రాష్ట్ర మానవ వనరులు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్, గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. సమావేశం అనంతరం నాల్గవ భవనంలో మీడియా సమావేశం నిర్వహించి మంత్రివర్గ ఉప సంఘం తీసుకున్న నిర్ణయాలను మంత్రులు అనిత, సంధ్యారాణి వెల్లడించారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో మాదక ద్రవ్యాల రహితంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు. అందుకు అనుగుణంగా నిర్ణీత ప్రణాళిక ప్రకారం కృషి చేయాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలైవారి భవిష్యత్తుకు, కుటుంబాలకు కూడా తీరని నష్టం జరుగుతుందన్నారు. గంజాయి పంటను నాశనం చేయడానికి రెండేళ్లుగా సెబ్‌కు ఎలాంటి అనుమతి ప్రభుత్వం ఇవ్వలేదని హోంమంత్రి అనిత చెప్పారు. గంజాయి సాగుకు పెట్టుబడి పెట్టే, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మత్తు పదార్థాల అలవాటును నియంత్రించే డి-అడిక్షన్ కేంద్రాలు, పునరావాస కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పాఠశాల దశ నుంచే విద్యార్థులకు గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో ఈ కేసుల్లో ఖైదీలుగా శిక్షలు అనుభవిస్తున్నవారిలో అత్యధికం మైనర్లే ఉండటం బాధాకరమని అనిత అన్నారు. గంజాయి సాగుకు పెట్టుబడులు ఎవరు పెడుతున్నారు, డిఫాల్ట్ బెయిల్ మీద బయటకు వచ్చిన వారు ఎవరనే దానిపై నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ముందుగా వంద రోజులలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు కృషి చేస్తామని, గంజాయి సాగుపై సమాచారం ఇచ్చిన వారికి ప్రభుత్వం నుంచి తగిన బహుమతులు అందజేస్తామని తెలిపారు. గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ... ప్రభుత్వం కేటాయించిన భూముల్లో గంజాయి సాగు, వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను గిరిజనులకు అర్థం అయ్యేలా అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆ భూముల్లో కాఫీ, అల్లం, చింతపండు, పసుపు వంటి పంటలను మాత్రమే సాగయ్యేలా చూస్తామన్నారు. ప్రలోభాలకు గురైన గిరిజనులు గంజాయి సాగు చేయడానికి గత ప్రభుత్వం ఐటీడీఏలను నిర్వీర్యం చేయడం కూడా ఒక కారణమని తెలిపారు.

గిరిజనులు వారి పిల్లలను మంచి పౌరులుగా తయారు చేసేందుకు నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తల్లి దండ్రులు పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించాలని గిరిజన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పిల్లలు గంజాయికి అలవాటుపడినట్లయితే... ఎలాంటి భయం లేకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని... వారి వివరాలు గోప్యంగా ఉంచి, తగిన సహాయం అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ ద్వారక తిరుమలరావు, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ పాల్గొన్నారు. .

పిన్నెల్లి అరెస్టు అన్యాయం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారన్నారు. మేనిఫెస్టోలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారని...అవన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒక ఎమ్మెల్యేగా రిగ్గింగ్‌ను అడ్డుకునే కార్యక్రమాన్ని పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చేస్తే... ఆయనపై హత్యాయత్నం కేసు (307) పెట్టి అన్యాయంగా జైల్లో నిర్బంధించారని ఆరోపించారు. 2009 నుంచి వరుసగా నాలుగుసార్లు పిన్నెల్లి గెలిచాడంటే మంచోడు కాబట్టే ప్రజలు ఆశీర్వదిస్తూ వచ్చారన్నారు. అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తప్పుడు కేసుల్లో ఇరికించడం ఎంత వరకు ధర్మం? అని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో జగన్‌తో పాటు మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, అనిల్ కుమార్ యాదవ్, కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆదాల ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

(మొదటిపేజీ తరువాయి)

లీకేజీలో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని తెలిపారు. ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా 65 పేపర్ లీకేజి ఘటనలు జరిగినా పరీక్షలు నిర్వహించే ఎన్‌టీఏ పై చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతోందని మండిపడ్డారు. క్యూట్, నీట్ వంటి కేంద్రీకృత పరీక్షలు విద్యను ప్రైవేటీకరించడాన్ని, కోచింగ్ సెంటర్ల సంస్కృతిని పెంపొందించడాన్ని ప్రోత్సహిస్తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పేద విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా, భరించలేనిదిగా చేసిందన్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది విద్యార్థులు కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. 'వన్ నేషన్- వన్ ఎగ్జామ్' అనే ముసుగులో మొత్తం పరీక్షా వ్యవస్థను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్‌టీఏను రద్దు చేసి రాష్ట్రాల పరిధిలో నీట్, నెట్ పాత పద్ధతిలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలని లేని పక్షంలో భవిష్యత్తులో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎం.రామకృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్, భాస్కర్ మాట్లాడుతూ... నెట్, నీట్ పేపర్ లీకేజీలు జరిగాయని... బీహార్ రాష్ట్రంలో 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారని గుర్తు చేశారు. ఈ లీకేజీల్లో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని తెలిసినా కేంద్ర విద్యా శాఖ వారిపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. తక్షణమే కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బాధ్యతల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్. వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయి కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు భూషణ్, ఐసా జిల్లా కార్యదర్శి మహేష్,శివ నాయక్, ఎస్ఎఫ్ఐ విజయవాడ నగర కార్యదర్శి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో...

గుంటూరులో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. గుంటూరులోని హిందూ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, ఏసీ కళాశాలల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి మీడియాతో మాట్లాడుతూ... జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టీఏ విఫలమవడంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందన్నారు. దీనిపై నోరు మెదపలేని స్థితిలో కేంద్రం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష నిర్వహించే ఎన్‌టీఏను రద్దు చేయాలని బాధిత విద్యార్థులు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు మొరపెట్టుకున్నా కూడా స్పందించకపోవడం దారుణమన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ఎన్‌టీఏను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారే కానీ బాధిత విద్యార్థులకు న్యాయం చేస్తామని గానీ నీట్ పరీక్షను మళ్లీ నిర్వహిస్తామని గానీ చెప్పకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ బీ సుచరిత, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షులు తిరుమలరావు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, నాయకులు అమర్నాథ్, అజయ్, గణేష్, కిరణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు యశ్వంత్ ఆరిఫా, భగత్ సింగ్, నగర్ నాయకులు షంషీర్, ఆరిఫ్, రోహిత్, హర్ష, ఎన్ఎస్‌యూఐ నాయకులు సుమన్, కోటేశ్‌బాబు, మదన్, పీడీఎస్‌యూ నాయకులు ప్రసన్న, మానస, చరిత తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జిల్లాలో...

కర్నూలు జిల్లాలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూసివేశారు. ముఖ్యంగా జిల్లాలోని ఆదోని, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, షాబీర్‌బాష, పీడీఎస్‌యూ రాష్ట్రకార్యదర్శి భాస్కర్, ఐసా రాష్ట్ర నాయకులు నాగరాజు, ఐసా, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థిసంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల అక్రమాలపై విచారణ

నెల్లూరు, కడప లేఅవుట్ల అవకతవకలపై చర్యలు

మున్సిపల్ మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీఆర్ బాండ్లలో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం సంబంధిత శాఖాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి అనంతరం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థలు ఉన్నాయని, వీటిలో మండపేట మున్సిపాలిటీ మినహా మిగిలిన 122 పట్టణ స్థానిక సంస్థలు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఉంటాయన్నారు. ఇవి అన్నీ రాష్ట్ర విస్తీర్ణంలో 85 శాతం మేర విస్తరించి ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఒక సీఆర్‌డీఏ, 20 పట్టణాభివృద్ధి సంస్థలు ఉన్నాయని, వాటి పరిధిలో ఉండే లేఅవుట్లలో విద్యుత్, రోడ్లు, తాగునీరు, పార్కులు, మురుగునీటి పారుదల వ్యవస్థలు ఏర్పాటు చేయడమే ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఆయా సంస్థల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించడం వల్ల లేఅవుట్లలో మౌలిక వసతులు మెరుగు కాకపోవడమే కాకుండా ఆయా సంస్థలు నిర్వీర్యం అయ్యే దశకు చేరుకున్నాయన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పట్టణాభివృద్ధి సంస్థల పునరుత్తేజానికి, పనితీరును మెరుగు పర్చే విధంగా అనేక చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. నెల్లూరు, కడప లేఅవుట్లలో అవకతవకలు జరిగినట్లుగా గుర్తించి విచారణా కమిటీని వేశామని, ఆ కమిటీ నివేదిక వచ్చిన వెంటనే అవకతవకలకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తణుకులో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని మంత్రి వెల్లడించారు. రూ.36 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను జారీ చేయాల్సి ఉండగా రూ.700 కోట్లకు పైబడి జారీచేశారని, ఫలితంగా బాండ్లు కొన్నవారు అనేక ఇబ్బందులను ఎదుర్కుంటున్నట్లు మంత్రి తెలిపారు. లక్ష లోపు జనాభా ఉన్న నగర పంచాయితీల్లో మౌలిక వసతుల మెరుగుకు అమృత్-1,2 ప్రాజక్టులను తమ ప్రభుత్వ హయాంలో చేపట్టగా, గత ప్రభుత్వం ఆ ప్రాజక్టులను కూడా నీరుగార్చిందన్నారు. అమృత-1,2 పథకాల క్రింద చేపట్టిన పనులను అసంపూర్తిగా వదిలేశారని, వీటి కింద రూ.1100 కోట్లు వస్తే ఆ నిధులను కూడా పూర్తిగా మళ్లించి బిల్లులను కూడా పెట్టకుండా వదిలేయగా, ఈ అంశం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్నట్లు మంత్రి వివరించారు. అదే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దాదాపు 9 లక్షల టిడ్కో గృహాలను నిర్మించేందుకు గతంలో తమ ప్రభుత్వం మంజూరు చేయగా, వాటి నిర్మాణాలను కూడా అసంపూర్తిగా ప్రభుత్వం వదిలేసిందన్నారు. ఈ పథకాలు అన్నింటినీ పున: ప్రారంభించేందుకు త్వరలో తగు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరికి చంద్రబాబు, జగన్, పవన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూల మాలవేసి నివాళులర్పించారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి అల్లూరికి శ్రద్ధాంజలి ఘటించారు. మన్యం వీరుడి సేవలను స్మరించారు. ఆదివాసీల హక్కుల కోసం శ్రమించిన అల్లూరి సేవలు స్ఫూర్తిదాయకమని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడు, బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలబడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ కొనియాడారు. ఆయన పోరాటాలు, ఆయన త్యాగాలు ఎప్పుడూ గుర్తుండిపోయేలా రాష్ట్రంలో ఒక జిల్లాకు ఆయన పేరు పెట్టుకున్నామని జగన్ ట్వీట్ చేశారు. అల్లూరికి మనస్ఫూర్తిగా నివాళులర్పిస్తున్నానని చెప్పారు. బ్రిటిష్ పాలకులపై పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు వింటేనే ఒక మహోజ్వల శక్తి, స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ అందుతాయని, అల్లూరి స్ఫూర్తిని నవతరం కొనసాగించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరారు. పరాయి పాలకుల చేతిలో పీడితులుగా ఉన్న గిరిజనుల కోసం పోరాడిన అల్లూరిని స్ఫూర్తిగా నవతరం తీసుకోవాలని కోరుతూ నివాళులర్పించారు.

అధికారులూ తొందరపడొద్దు

వైసీపీ కార్యాలయాల కూల్చివేతపై స్టేటస్ కో కొనసాగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ కార్యాలయాల కూల్చివేతపై స్టేటస్ కోను కొనసాగిస్తూ హైకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. కార్యాలయాల కూల్చివేతపై అధికారులు తొందరపాటు చర్యలు వద్దని ఆదేశించింది. ప్రతి దశలోనూ వైసీపీ తరపున ఇచ్చే వివరణనూ తీసుకోవాలని తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 21 ప్రాంతాల్లో వైసీపీ కార్యాలయాల కూల్చివేతలకు కూటమి ప్రభుత్వ ఆదేశాలతో ఇటీవల అధికారులు నోటీసులు జారీజేశారు. ఇప్పటికే తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయ నిర్మాణాలను ధ్వంసం చేశారు. మిగిలిన జిల్లాల్లోని పార్టీ కార్యాలయాలకూ మూకుమ్మడిగా నోటీసులు ఇచ్చారు. వాటిని సవాల్ చేస్తూ హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్‌ను ఆ పార్టీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేశారు. వైసీపీ కార్యాలయాలను కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షతో కూల్చివేతకు ప్రయత్నిస్తోందని పిటిషన్‌లో పేర్కొన్నారు. కార్యాలయాల నిర్మాణాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వివిధ పార్టీల కార్యాలయాలకు కేటాయించిన భూములకు జారీజేసిన ఉత్తర్వుల ఆధారంగానే తామూ భూములు కేటాయించామని పిటిషన్‌లో వివరించారు. దీనిపై ప్రభుత్వం తరపున న్యాయవాది కూడా వాదనలు విన్పించారు. వైసీపీ అనుమతులు పొందకుండా కార్యాలయాలను నిర్మించిందని తెలిపారు. ఈ వాదోపవాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వుడు చేయగా... దానిని గురువారం వెల్లడించింది. వైసీపీ కార్యాలయాల కూల్చివేతలపై ఉన్న స్టేటస్ కోను యథాతథంగా కొనసాగించాలని ఆదేశించింది. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగితే తప్ప, ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని తెలిపింది. రెండు నెలల్లోగా భవనాలకు సంబంధించిన అనుమతులను సమర్పించాలని వైసీపీని హైకోర్టు ఆదేశించింది. కూల్చివేతల విషయంలో అధికారులు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని స్పష్టం చేసింది.

'అల్లూరి' పోరాటస్ఫూర్తి యువతకు ఆదర్శం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, లౌకికతత్వాల పరిరక్షణకు యువత అల్లూరి స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా గురువారం విజయవాడ, బుడమేరు కట్ట సెంటర్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతదేశాన్ని ఆక్రమించిన బ్రిటీషు వారికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన తెలుగుతేజం, మన్యం వీరుడు అల్లూరి నడిపిన సాయుధ పోరాటం భారత దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మొక్కవోని దీక్షతో గిరిజనులను కూడగట్టి, బ్రిటీష్ వారిని ఎదిరించి... తన ప్రాణాలను కూడా తృణప్రాయంగా అర్పించిన వీరుడు అల్లూరి అని కొనియాడారు. సీతారామరాజు జయంతి సందర్భంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఆయన నెరపిన పోరాటాన్ని స్మరించుకుంటున్నామన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని కాపాడుకోవడానికి, అట్టడుగు వర్గాల ప్రజలకు న్యాయం జరిగేందుకు సీతారామరాజు పోరాట స్ఫూర్తితో అందరూ ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా యువజన, విద్యార్థులు అల్లూరి ధైర్యాన్ని పుణికిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణతోపాటు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రబాబు, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు మూలి సాంబశివరావు, కేవీ భాస్కరరావు, అప్పురబోతు రాము, సీపీఐ నగర నాయకులు లింగాబత్తుల శివకుమార్, కేఆర్ ఆంజనేయులు, తమ్మిన దుర్గ, యువజన నాయకుడు లంకా గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గ శ్రేయస్సుకు కృషి చేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: మున్సిపల్ కార్మికులకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలునకు ప్రస్తుత ప్రభుత్వం కట్టుబడాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను చేయొద్దని... ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబాల సంక్షేమానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికవర్గ శ్రేయస్సుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఓబులేసు గురువారం స్థానిక గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో మున్సిపల్ కార్మికుల సంఘం ఏపీ అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అధ్యక్షతన జరిగిన ఆఫీస్‌బేరర్ల సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు, ఇంజనీరింగ్ ఒప్పంద కార్మికులకు, కార్యాలయ సిబ్బందికి వైసీపీ పాలనలో అన్యాయం జరిగిందని అన్నారు. కార్మికులకు జీతాలు పెంచకపోగా, ఉన్న సంక్షేమ పథకాలనూ వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడంలో కార్మికవర్గం ప్రధాన భూమిక పోషించిందని ఓబులేసు అన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారాయుడు మాట్లాడుతూ ఈనెల 24, 25, 26 తేదీలలో చిత్తూరు జిల్లాలోని హార్సిలీ హిల్స్ నందు మున్సిపల్ కార్మికుల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని వెల్లడించారు. సాంఘిక చైతన్యానికి దోహదమవ్వడమే కాక మున్సిపల్ కార్మికుల భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం లభిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 350 మంది కార్మిక నేతలు హాజరవుతారని చెప్పారు. శిక్షణ తరగతుల జయప్రదానికి సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం నాయకులు పులగం మద్దిలేటి, భజంత్రీ శ్రీనివాస్, జేమ్స్, దొరస్వామి, మదన్, వెంకటేశ్వరావు, పొడుగు రామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

డీజీపీకి ఏపీయూడబ్ల్యూజే బృందం వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూ డబ్ల్యూజే) ప్రతినిధి బృందం రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావును కోరింది. అలాగే జర్నలిస్టులపైన, పత్రికా కార్యాలయాలపైన జరిగిన దాడుల కేసుల్లో నిందితులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని విజ్ఞప్తి చేసింది. ఏపీయూ డబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం డీజీపీని తన ఛాంబర్‌లో కలిసింది. ఈ సందర్భంగా డీజీపీని శాలువా కప్పి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం అక్రమ కేసులు వ్యవహారానికి సంబంధించి వినతి పత్రం అందజేశారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపైన, అనంత పురం జిల్లాలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్‌పైన, తిరుపతిలో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్ల పైన దాడితో పాటు రాష్ట్రంలో అనేక చోట్ల జర్నలిస్టుల పైన దాడులు చేసిన వాటికి సంబంధించిన కేసుల్లో ఇంతవరకు ఎలాంటి పురోగతి లేకపోవడం చాలా బాధాకరమని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసుల్లో దోషులను వెంటనే అరెస్టు చేసి శిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే జర్నలిస్టుల పైన రాష్ట్రవ్యాప్తంగా అనేక అక్రమ కేసులు నమోదైన విషయాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విజయనగరంలో నలుగురు జర్నలిస్టులపై సమాచార శాఖ అధికారుల తప్పుడు ఫిర్యాదు మేరకు సీఐడీ అక్రమంగా కేసు నమోదు చేసిందని, ఈ కేసును వెంటనే ఎత్తివేయాలని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. సత్య సాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల, తిరుపతి, ప్రకాశం, కృష్ణ, పల్నాడు, మన్యం తదితర జిల్లాల్లో జర్నలిస్టులపై నమోదైన అక్రమ కేసుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్రమ కేసులు అన్నింటినీ అవసరమైతే పునర్విచారణ జరిపించి ఎత్తివేయాలని కోరారు. ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధుల బృందం చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్న డీజీపీ రాష్ట్రవ్యాప్తంగా అనేక వర్గాల పైన కూడా తప్పుడు కేసులు నమోదైన విషయాలు తన దృష్టికి తీసుకువస్తున్నారని, జర్నలిస్టులపై నమోదైన కేసులను ప్రత్యేక చొరవ తీసుకొని తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. డీజీపీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చావా రవి, ఐజేయూ కౌన్సిల్ సభ్యులు షేక్ బాబు, విజయవాడ యూనిట్ ఉపాధ్యక్షులు పి.సురేంద్ర ఉన్నారు.

జగన్ మళ్లీ జైలుకు !

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉన్న వనరులన్నీ దోచుకుని...ప్రశ్నిస్తే పీకలు కోసి సొంత రాజ్యాంగంతో ఆటవిక పాలన సాగించిన వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జైలుకు వెళ్లే సమయం దగ్గర పడిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో గురువారం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పోలింగ్ బూత్‌ల్లోకి చొరబడి ఈవీఎంను పగలగొట్టిన ముద్దాయిని పరామర్శించడానికి మాజీ సీఎం జగన్ లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి విమానంలో వెళ్లారని విమర్శించారు. నాలుగు విడతలుగా మాచర్ల ఎమ్మెల్యేగా గెలిచిన పిన్నెల్లి చేసిన అరాచకాలకు హద్దు లేకుండా పోయిందని మండిపడ్డారు. ఆయనకు హైకోర్టులో బెయిల్ రాకపోవడంతో లొంగిపోవాల్సి వచ్చిందన్నారు. పిన్నెల్లిని జగన్ పరామర్శించి వెళ్లకుండా...పైపెచ్చు టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శించడాన్ని ఖండించారు. మాచర్లలో గడిచిన ఐదేళ్లలో టీడీపీ నేతలపై అనేక దాడులకు పాల్పడ్డారన్నారు. మాచర్లలో వైసీపీ నేతల ఆగడాలను ప్రజలు తిప్పికొట్టారన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 21రోజులకే ఇచ్చిన హామీలను అమలు చేయలేదని జగన్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ చేసిందంతా శూన్యమన్నారు. సంక్షేమం పేరుతో రాష్ట్ర ఖజానాను లూటీ చేశారని, బటన్ నొక్కుడు పేరుతో ప్రజలను మోసగించారని విమర్శించారు. ఐదేళ్లుగా చట్టపరంగా ప్రతిపక్షానికి ఇవ్వాల్సిన గౌరవం జగన్ ఇవ్వలేదని, అందుకే మీకు ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. జగన్ చుట్టూనే రౌడీలు, దొంగలున్నారనీ...మళ్లీ టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

గుజ్జుల ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటస్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ విజయవాడ నగర సమితి అధ్వర్యంలో దాసరి భవన్‌లో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్య, వైద్యం, ఉద్యోగాల కోసం పోరాటాలు తప్పవన్నారు. ఎన్నికల హామీలను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని, ఏపీలో ఉద్యోగాలకు ప్రత్యేక టైంటేబుల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర యువజన విధానాన్ని అమలు, నిరుద్యోగులకు భృతి. మద్యం, గంజాయి, మాదక ద్రవ్యాలను నియంత్రణకు చర్యలను కూడా ఆయన డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నగర ప్రధాన కార్యదర్శి లంకా గోవింద రాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు, ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, నగర సహాయ కార్యదర్శి శింగంశెట్టి మోహన ప్రసాద్, శీరం రవి, గాడి అజయ్, హరీశ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జయంతికి రండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల భేటీ అయ్యారు. ఈ మేరకు గురువారం బెంగుళూరులో సిద్ధరామయ్యను షర్మిల కలిసి... ఈ నెల 8న విజయవాడలో నిర్వహిస్తున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతికి హాజరు కావాలని కోరారు.

కోడుమూరు మాజీ ఎమ్మెల్యే అరెస్టు

కర్నూలు-విశాలాంధ్ర క్రైం: వైసీపీ నేత, కర్నూలు జిల్లా కోడుమూరు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబును గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బాలికపై అసభ్యంగా ప్రవర్తించాడని పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. తన ఇంట్లో పనిచేసే బాలికపై ఆయన గతంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డట్టు ఆరోపణలు వచ్చాయి. ఎన్నికల ముందు బాలికపై సుధాకర్ బాబు అసభ్యంగా ప్రవర్తించిన ఓ వీడియో వైరల్ అయిన సంగతి తెలిసిందే. తాజాగా కేసు నమోదు చేసి స్టాంటెంపురంలోని తన నివాసంలో ఉన్న ఆయనను డీఎస్పీ విజయ్ శేఖర్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి తొలుత కర్నూల్ టూ టౌన్ స్టేషన్‌కు, అనంతరం ఓర్వకల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 2019 ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైసీపీ తరుపున శాసన సభ్యునిగా పోటీ చేసి విజయం సాధించారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

విశాలాంధ్ర-విశాఖ: మత్స్యకారులకు గుర్తింపుకార్డులు, భరోసా ఇవ్వాలని, చేపల మార్కెట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని చేతి వృత్తి దారుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెయ్యల నాగభూషణరావు అధ్యక్షతన గురువారం మత్స్యకారుల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేశారు. చేతివృత్తిదారుల కార్యనిర్వహణ కార్యదర్శి లింగమయ్య, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నల్లయ్య, అధ్యక్షుడు పి.పోతయ్య, పార్వతి, నూకాలమ్మ, ఎల్లయమ్మ, కాసు బాబు, బుజ్జి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో 'అల్లూరి' విగ్రహం పెట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర-భీమవరం: విప్లవ వీరుడు అల్లూరి సీతారమరాజు విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం అల్లూరి సీతారామరాజు 127వ జయంతి సందర్భంగా భీమవరంలో జరిగిన నివాళి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా (ఆయన మాట్లాడుతూ... అల్లూరి పోరాటం దేశం ప్రజలందరికీ స్ఫూర్తి దాయకం అన్నారు. అల్లూరి స్వగ్రామం మొదలుకొని ఆయన పోరాటం చేసిన అన్ని ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెయ్యాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చాక గిరిజన ప్రాంతాలు కనుమరుగవుతున్నాయన్నారు. గిరిజన సంపదను అంబానికి, అదాని లాంటి వారికి అప్పగించడానికి హైవేలు వేస్తున్నారని విమర్శించారు. జాతీయ స్ఫూర్తికి విఘాతం కలిగించేలా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. వివిధ మత విశ్వాసాలు, సంప్రదాయాలు, విభిన్న సంస్కృతులున్న దేశంలో విలువలు, సంప్రదాయాలు, ఐక్యతను విచ్ఛిన్నం చెయ్యాలని చూస్తున్నారని ఆరోపించారు. బ్రిటీషు వారిని తరమి కొట్టేందుకు అల్లూరి చూపిన పోరాట స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అల్లూరి జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ అల్లూరి జీవితం విద్యార్థులకు ఆదర్శనీయమన్నారు. భీమవరంలో విగ్రహాన్ని ఆవిష్కరించిన మోదీకి దేశ పార్లమెంటులో అల్లూరి విగ్రహాన్ని పెట్టాలనే స్పృహ ఎందుకు కలగలేదని ప్రశ్నించారు. విశాఖ ఎక్స్ ప్రెస్ కి అల్లూరి పేరు పెట్టాలనే డిమాండ్ సహేతుకం అన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ 25ఏళ వయసులో బ్రిటీష్ వారిని గడగడలాడించిన అల్లూరికి ప్రభుత్వాలు సరైన గుర్తింపు నివ్వలేదన్నారు. అల్లూరి చేసిన 2 ఏళ్ల పోరాటం దేశ చరిత్రలో నిలిచిపోయిందని కొనియాడారు. అల్లూరి జీవితాన్ని సినిమాల్లో, పుస్తకాల్లో, సాహిత్యాలలో చేర్చాలన్నారు. అటవీ సంపద గిరిజనులకే చెందాలని అల్లూరి కాంక్షించారని... అల్లూరి ఆశించిన గిరిజన అభివృద్ధిని ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. అల్లూరి స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, విలువలను, హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సభాధ్యక్షులు బి.బలరాం మాట్లాడుతూ నరసాపురంలో ఏర్పాటుచేస్తున్న ఆక్వా యూనివర్సిటీకి, చించినాడ బ్రిడ్జికి, భీమవరం ఓవర్ బ్రిడ్జికి, విశాఖ ఎక్స్ ప్రెస్ కి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. భీమవరంలో పాత బస్టాండు వద్ద ఉన్న అల్లూరి భవనాన్ని కూల్చి చెత్త కుప్పగా మార్చడం అల్లూరిని అవమానించడమే అని మండిపడ్డారు. వెంటనే అల్లూరి పేరుతో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత కూనపరాజు కుమార్, అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు గాదిరాజు సుబ్బరాజు , చెరుకువాడ సుబ్రహ్మణ్యంరాజు , కలిదిండి గోపాలకృష్ణంరాజు, రిటైర్డ్ జడ్జి మైలా రామ్మూర్తి వర్మ, సీనియర్ రిటైర్డు జడ్జి ఎస్వీ నెల్సన్ రాజు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు పాతపాటి మురళీ కృష్ణంరాజు, రిటైర్డు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గాతల జేమ్స్, శతవర్ధంతి సభ నిర్వహణ కమిటీ కార్యదర్శి జేఎస్‌వీ గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధిచెప్పే రోజులు త్వరలోనే...

అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలో రాహుల్ గాంధీ బొమ్మను బీజేపీ శ్రేణులు దహనం చేసిన ఘటనపై కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పార్టీ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలీ మాట్లాడుతూ, కేంద్రంలో అధికార బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. దాదాపు 24 లక్షల విద్యార్థుల భవితవ్యానికి సంబంధించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పార్లమెంట్ సాక్షిగా కేంద్రాన్ని నిలదీసి, బీజేపీ నేతల అక్రమాలను రాహుల్‌గాంధీ బయటపెట్టారన్నారు. బీజేపీ నేతలు, హిందుత్వం పేరుతో రాహుల్‌పై బురద జల్లేందుకు దిగారని దుయ్యబట్టారు. ప్రజల పక్షాన పోరాడుతున్న రాహుల్‌పై అత్యున్నత పదవిలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ, ఇతర బీజేపీ శ్రేణులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని పార్లమెంట్ సాక్షిగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు సిగ్గుతో తలదించుకునే విధంగా మణిపూర్‌లో అత్యంత హేయంగా మారణకాండ జరిగినప్పటికీ, ఇంత వరకు కనీసం ఆ రాష్ట్రాన్ని పర్యటించక పోవడం ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా నిరంకుశ ధోరణికి నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ, అంబానీ, అదానీలైన ఇద్దరు గుజరాతీల చేతిలో దేశ భవిష్యత్తును మోదీ తాకట్టు పెట్టారని ఆరోపించారు. వి.గుర్నాథం, మేడా సురేశ్, ధనేకుల మురళి, మీసాల రాజేశ్వరరావు, వేగే వెంకటేశ్, వడ్డి సోమశేఖర్, ఖుర్షీదా, లక్కరాజు రామారావు పాల్గొన్నారు.

సంపాదకీయం

అంధ భక్తిలో సమిధలు

ఆశారాం బాపు, డేరా సచ్చా బాబా రాం రహీం సింగ్, బాబా భోలే బాబా, బాబా రాజీందర్ కాలియా – ఇలా ఏ పేరు తలుచుకున్నా ఒకే రకమైన లీలలు కనిపిస్తాయి. వీరి లీలలకు భక్తులు మోసపోతూనే ఉంటారు. మంగళవారం భోలే బాబా హాత్రస్ లో నిర్వహించిన సత్సంగంలో తొక్కిసలాట వల్ల కనీసం 121 మంది మరణించారు. మరో 150 మందికి పైగా గాయపడ్డారు. ఆ రోజు ఏదో విపరీత సంఘటన జరగబోతోందని భోలే బాబా ముందే చెప్పారంటున్నారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఈ దుర్ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఆదేశించింది. అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి బ్రిజేశ్ శ్రీవాత్సవ నేతృత్వంలో ముగ్గురు సభ్యులుగల దర్యాప్తు సంఘాన్ని ఏర్పాటు చేసింది. రెండు నెలల్లోగా ఈ దర్యాప్తు సంఘం నివేదిక అందజేయాలని యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆదేశించింది. యోగీ ఆదిత్యనాథ్ ఈ తొక్కిసలాట వెనక ఏదో కుట్ర ఉండొచ్చునేమోనన్న అనుమానం వ్యక్తం చేయడం ద్వారా దర్యాప్తు ఏ దిశలో సాగాలో నిర్దేశించారు. ఈ సత్సంగానికి దాదాపు రెండున్నర లక్షల మంది హాజరయ్యారు. ఇంత మంది హాజరయ్యే చోట ఎలాంటి భద్రతా వ్యవస్థ ఉండాలో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పట్టించుకున్నట్టు లేదు. దానికి తోడు బాబా నిర్వహించే సత్సంగం ఆవరణలో సకల వ్యవహారాలను ఆయన వెంట ఉండే భద్రతా సిబ్బందే చూసుకుంటారట. పోలీసులను లోపలికి అనుమతించరట. అది బాబా నియమం కావచ్చు. కానీ అపరిమిత సంఖ్యలో జనం హాజరవుతారనుకున్న సందర్భాలలో భద్రతా అంశాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వం అనుమతి ఎలా మంజూరు చేస్తుందో అంతుపట్టదు. బాబా దైవిక శక్తి, ఆయన భద్రతా వ్యవస్థ మీద ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి అపారమైన విశ్వాసం ఎలా కుదిరిందో తెలియదు. ఇలాంటి బాబాలందరికీ అపారమైన రాజకీయ పలుకుబడి ఉంటుందని అనేకసార్లు రుజువైంది. బాబా భోలేనాథ్‌కు సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ మద్దతు ఉందని, ఆయన ఒకసారి సత్సంగంలో పాల్గొని బాబా కీర్తిగానం చేశారని అంటున్నారు. కానీ బీజేపీ నాయకులు అనేకమంది ఆయన భక్తులు, అనుయాయులే. బాబాలను, మూఢ నమ్మకాలను విశ్వసించడంలో రాజకీయ నాయకులు పార్టీలతో నిమిత్తం లేకుండా పోటీ పడ్డారు. పరిపాలనా వ్యవస్థకు పూచీ పడవలసిన అధికారపక్ష నాయకులే మూఢ నమ్మకాలలో మునిగి తేలుతున్నప్పుడు, బాబాలకు భక్తులైనప్పుడు ప్రజలకు భద్రత ఉండే అవకాశం లేదు. ఈ దుర్ఘటన తరవాత దాఖలు చేసిన ఎఫ్.ఐ.ఆర్.లో ఇప్పటి వరకు బాబా పేరే లేదు. కానీ తొలిదశలో మాత్రం ఆయనను కాపాడడానికి సకల ప్రయత్నాలు జరుగుతున్నట్టు స్పష్టం అవుతోంది. ఈ సత్సంఘానికి అనుమతి తీసుకున్న వారి పేర్లు మాత్రమే ఎఫ్.ఐ.ఆర్.లో నమోదు చేశారు. ఈ దుర్ఘటనకు ప్రత్యక్ష బాధ్యుడు సాక్షాత్తు బాబాయేనన్న విషయాన్ని పట్టించుకోకపోవడంలోనే అసలు కుట్ర దాగి ఉంది. తొక్కిసలాట జరిగిన తరవాత బాబా తన అనుయాయులతో కలిసి అక్కడి నుంచి ఉడాయించారు. తీరా తొక్కిసలాట జరిగిన తరవాత మృతులను, గాయపడిన వారిని దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్తే అక్కడ ఉన్నది ఒకే ఒక డాక్టరు. కనీస ఆరోగ్య సదుపాయాలు దగ్గరలో లేనిచోట ఇంత భారీ సత్సంగాలను ఎలా అనుమతిస్తారో భక్తిలో మునిగిపోయే ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. వ్యక్తిగత విశ్వాసాలు, పరిపాలనా బాధ్యతల మధ్య తేడా లేనప్పుడు ఇలాంటి ఘటనలు పునరావృతం కాక తప్పదు. ఈ తొక్కిసలాట జరిగిన సమయంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో రాహుల్ గాంధీ అంతకు ముందుచేసిన ప్రసంగంలోని లోపాలను వెతికి పట్టి ఖండించడంలో నిమగ్నమయ్యారు. ఈ దుర్ఘటనకు సంబంధించిన సమాచారం అందిన తరవాత కూడా ఆయన ప్రసంగ ధార కొనసాగిస్తూనే ఉన్నారు.

నిజానికి భోలే బాబా ఇంతకు ముందే నేరస్థుడు. జైలుకు కూడా వెళ్లి వచ్చిన ఘనుడాయన. కొంతకాలం పోలీసువిభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసి సస్పెండ్ అయిన తరవాత ఉద్యోగం మానేసి బాబా అవతారమెత్తాడు. బాబా రాం రహీం సింగ్ మీద ఉన్నట్టే భోలే బాబా మీద కూడా లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయి. ఉత్తరప్రదేశ్ లోనే కాకుండా ఆయనకు రాజస్థాన్, హర్యానా, మధ్య ప్రదేశ్ లాంటి ఇతర రాష్ట్రాల్లో కూడా అపారమైన భక్త గణం ఉంది. అలాగే వివిధ రాష్ట్రాలలో ఆయన మీద కేసులూ ఉన్నాయి. ఆయన అసలు పేరు సూరజ్ పాల్. నారాయణ్ సర్కార్ హరి అన్న మరో పేరో, మారు పేరో కూడా ఉంది. కానీ భోలే బాబాగానే ప్రసిద్ధుడు. హాత్రస్ దగ్గర్లో జరిగిన ఈ సత్సంగానికి హాజరై మృత్యువాత పడ్డవారు, గాయాలపాలైన వారిలో ఎక్కువ మంది ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలు, బాలలే ఉన్నారు. తమ ఈతి బాధల నుంచి బయట పడడానికి బాబా ప్రవచనాలు విని తరించిపోవడం కోసం సత్సంగానికి వచ్చి "మోక్షం" పొందారు. ఆయన పాద ధూళిలో మహత్తు ఉందని, ఆయన దగ్గర మంత్ర జలం ఉంటుందని, అది తమను కష్టాల నుంచి గట్టెక్కిస్తుందని జనం నమ్ముతారు. అలా నమ్మడానికి బాబా భోలేనాథ్ తన శిష్యగణం ద్వారా వాడవాడలా ప్రచారం చేయిస్తారు. ఆయన సంపత్తికి లోటు లేదు. లెక్కలేనన్ని ఖరీదైన కార్లు. వివిధ ప్రాంతాలలో దాదాపు 25 ఆశ్రమాలు. దుర్ఘటన జరిగిన తరవాత కకావికలైన భక్తులను ఆదుకోవడానికి బదులు అక్కడి నుంచి శిష్యగణంతోపాటు బాబా పలా యనం చిత్తగించారు. భక్తులను కాపాడడానికి ఏ ప్రయత్నమూ చేయని "దైవాంశ సంభూ తుడు" ఆయన. ఆయన ఇతర బాబాల్లాగా కాషాయ వస్త్రాలు ధరించరు. ఎప్పుడూ శ్వేత వస్త్రాల్లోనే కనిపిస్తారు. ఖరీదైన కళ్లజోడు వాడతారు. ఈ లెక్కన ఆయన అత్యాధునిక బాబా. ఆయన ఆశ్రమాల్లో ఎక్కడా ఆ గ్రామాల వారికి ప్రవేశార్హత ఉండదు. ఎప్పుడూ భార్య పక్కనే ఉంటుందట. కానీ 16–17 ఏళ్ల అమ్మాయిలతో కులుకుతుంటారు. ఆయన అన్ని ఆశ్రమాలు అక్రమ నిర్మాణాలేనంటున్నారు. భగవంతుడు ప్రత్యక్షమైన తరవాత పోలీసు ఉద్యోగం వదిలేశానంటున్నాడు. బాబా పాద ధూళి తాకితే సకల పాపాలు హరించుకుపోతాయని ఆయన శిష్యగణం ప్రచారంచేసి భక్తులను సమీకరిస్తుంది. బాబా కారు నుంచి దిగగానే అతని పాదాలను తాకడంకోసం అమాయకజనం పోటీ పడడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. బాబా పాదధూళి దక్కని వారు ఆయన కారును తాకినా తరించి పోయామనుకుంటారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగింది. ఇలాంటి దుర్ఘటనలన్నీ నివారించగలిగినవే. కానీ ప్రభుత్వ పెద్దలే పాద ధూళికోసం పరితపిస్తున్నప్పుడు జనానికి రక్షణ ఉంటుందనుకోలేం. సమిధలయ్యేది సామాన్య జనమే.

ప్రజాస్వామ్యం అడ్రసు ఎక్కడ

నేను లేను నేను బతికున్న శవాన్ని నా బతుకంతా చీకటి గదిలోనె రా బావ ఏంటి ఈ రోజు మరీ వినకూడని మటలతో వస్తున్నావు ఏ మయిందయ్యా నీకు. ఏం కావాలయ్యా ఇప్పుడు మనం బతికున్న శవాలం. అసలు మనకు మాటలు ఎందుకు నేర్పారా అని బాధపడు తున్నా. మనసులోని మాట బైటపెట్టడానికి వీలు లేదు. తెగించి బైటపెడితే జైలులో ఊసలు లెక్కపెడుతూ కూర్చోవాలి. ఏమో నాకైతే స్వాతంత్ర్యం ఎందుకు తెచ్చారయ్యా అని గాంధీ, నెహ్రూలను అడగాలని విస్తోంది. ఏది ఏమైనా బ్రిటీషువారి పాలన మెరుగనిపిస్తోంది. మరీ అంత డీలా పడిపోతావేమయ్యా. ఆనాడు గాంధి, నెహ్రూలే కాదు ఆనాటి కమ్యూనిస్టులూ స్వాతంత్ర్య సంగ్రామంలో ఉన్నారు. అయినా ప్రస్తుత పాలకులు అప్రజాస్వామ్య పద్ధతులపై పిడికిలి బిగించి పోరాడాలి. అంతేగాని, స్వాతంత్ర్యం వద్దనడం పొరపాటు. ప్రజా స్వామ్యంలో ప్రతిపాలకుడికి భావ స్వాతంత్ర్యం ఉండాలి. మాట్లాడే హక్కు ఉండాలి. మనసులోని మాట బైటపెట్టి ప్రశ్నిచే హక్కు ఉండాలి. కాని నేడు పాలకులు అందుకు విరుద్ధంగా

వ్యవహరిస్తూ ఇప్పుడున్న చట్టాలు చాలక కొత్తగా నేరచట్టాల కోసం బీజేపీ సభలో బిల్లుపెట్టబోతోంది.

అదేనయ్యా నేననేది ఇపుడే మాట్లాడే హక్కు లేదు. ఇక కొత్త చట్టాలు రూపొందించి మాట్లాడేవారి వెంట, పోరాడే వారి వెంట ఉన్నవారిని కూడా జైలుపాలు చేసే దుర్మార్గపు ఆలోచనలకు ప్రధాన పాలకుడు తెరదించుతున్నాడు. మరి ఇప్పుడు చెప్పు బావ. నేను బతికున్నానా చనిపోకపోయినా బతికున్న శవాన్ని కదా. నిజమేనయ్యా ప్రస్తుతం బీజేపీ పాలన మరీ రాచరిక పాలనను తలపిస్తోంది. హిందువుల పేరిట అరాచకపాలనతో ప్రతిపక్షం గొంతు నొక్కుతోంది. మనం హిందువులం మనమే పాలించాలి. భారతదేశంలో మనమే ఉండాలి. ఇతర మతస్థులకు స్థానంలేదు అనే ఆర్ఎస్ఎస్ వారి గొంతు పాలనలో వినిపించేటట్లుగా బీజేపీ పాలన సాగుతోంది. హిందు దేవుళ్ల పేరిట మత సహనం కోల్పోయి విధ్వంసం సృష్టిస్తున్నారని రాహుల్ గాంధీ అంటే శివున్నే తిడుతున్నట్లుగా ప్రజల ముందుకుతెచ్చి ప్రతిపక్షం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. అసలు బీజేపీ వారికి పాలించే హక్కు లేదు బావ. నాకొకమాట గుర్తు కొస్తోంది. ఒకసారి సభలో కడుపుమండి ఖర్గే ఒక మాటన్నాడు. అసలు స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ నెహ్రూ ప్రాణాలర్పించారు కాని బీజేపీ వారి యింట ఒక కుక్కయినా చచ్చిందా అన్నాడు. నిజమే ఆనాడు ఆర్ఎస్ఎస్ తప్ప బీజేపీ పార్టీ లేదు. మహాత్మాగాంధీని చంపిన గాడ్సేను సపోర్టు చేసినవారికి భారతదేశాన్ని పాలించే హక్కు లేదు. అయినా హిందుత్వంతో ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కి ఈనాడు రాజ్యాంగం ఇచ్చిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించి రాజుల వలె పాలించడం ఎంతో దుర్మార్గం. అది సరే ప్రస్తుతం అధికారం ముఖ్యమన్నట్లుగ అవకాశ అవసరాల పాలన సాగుతోంది. గతంలో సరిపోయి నంత మెజారిటీ వచ్చింది కనుక అప్పటి ముఖ్యమంత్రి జగన్‌ను తిప్పుకొని అడిగినవన్నీ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. తప్పనిసరి పరిస్థితిలో జగన్ వారికి ఉభయసభల్లో సపోర్టు ఇచ్చి తిరిగినా నిధులు రాల్చకుండా నిర్దాక్షిణ్యంగా తప్పుకున్నాడు. ప్రస్తుతం వారికి తగినంత బలం లేకపోవడంతో చంద్రబాబును కౌగిలించుకుని వీపు తట్టి లాలిస్తున్నారు. నిజమే ఇది అవకాశవాద రాజకీయ వేగా. అందులో అనుమాన మేముంది. అ విషయంలో మన ముఖ్యమంత్రి ఒకసారి బీజేపీ, మరొకసారి కాంగ్రెసును దూరం పెట్టాడు. అటు మోదీ ఇటు బాబు ఇప్పుడు అవకాశవాదులే అనిపిస్తోంది. అదంతా గతం కాని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రత్యేకహోదా తెస్తే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. కాని గతంలో రాష్ట్రం విడదీసే సమయంలో ఇచ్చిన మాట ప్రకారం హోదా ఇచ్చే పరిస్థితిలో ఉన్నా చంద్రబాబు హోదా కోసం పట్టుపట్టకుండ ప్యాకేజీకి ఒప్పుకోవడం వలన రాష్ట్రం నష్టపోయింది. ఇప్పుడు క్లిష్టపరిస్థితిలోనైనా ప్రత్యేక హోదా అడగాలి. ప్రస్తుతం హోదా రాష్ట్రానికి సంజీవిని లాంటిది. ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధు లందరు హోదా కోసం పోరాడవలసిన అవసరం ఉంది. అది సరేగాని కేవలం నిధుల కోసం నియంతపాలన సాగించే బీజేపీ వెంటబడి వారి కాళ్లకు మొక్కడం సరికాదు. ఇటువంటి పరిస్థితులలో వారిని అంట కాగడం కంటే జాలిపడతానన్న ఎన్‌టిఆర్ మాటలు గుర్తుతెచ్చుకోవాలి.

గుణపాఠం నేర్వని పాలకులు

కృష్ణ ఝా

ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు గత పదేళ్లుగా పాలిస్తున్న బీజేపీ, ప్రధాని మోదీ వ్యవహరిస్తున్న తీరు చూస్తే ఏమీ గుణపాఠం నేర్చుకోలేదని స్పష్టమవుతోంది. హిందుస్థాన్‌లో హిందూయేతర ప్రజలు హిందూ సంస్కృతిని, భాషను అనుసరించాలి. అంతేకాదు, హిందూజాతి, సంస్కృతుల గొప్పతనాన్ని పొగడాలి. అలా పొగిడేవాళ్లే ఈ దేశంలో ఉండాలి, హిందూ జాతికింద అణిగిమణిగి ఉండాలి, ఎలాంటి హక్కులను, సౌకర్యాలను కోరరాదు. పౌరహక్కులు కూడా ఉండవు. ఎలాంటి ఆదరణ, ప్రత్యేకత వారికి ఉండవు" ఆర్ఎస్ఎస్ నేత ఎంఎస్ గొల్వాల్కర్ రచించిన 'ఉయ్ ఎండ్ అవర్ నేషన్ హుడ్' అనే పుస్తకంలో పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపకులలో ప్రముఖ వ్యక్తి గోల్వాల్కర్. హిట్లర్‌ను, నాజీయిజాన్ని అనుసరించిన వ్యక్తి. దేశం స్వాతంత్ర్యం పొందినతర్వాత కూడా దేశం స్వాతంత్ర్యం పొందవలసి ఉందని అన్నారు. హిందూ రాష్ట్రం ఏర్పడితేనే దేశం విముక్తి పొందినట్లు అవుతుందని అన్నారు. హిట్లర్, గోల్వాల్కర్ చరిత్రలో కలిసిపోయారు. సమాజంలో తిరోగమనవాద స్వార్థపర శక్తులది పైచేయి అయినప్పుడు వారిరువురు మళ్లీ పుట్టుకొస్తారు. వారు ఏనాడు ఆర్థిక సమస్యలను చర్చించలేదు, అలాగే గుత్త పెట్టుబడి దారులకు, భూ స్వాములకు వ్యతిరేకంగా లేదు. వారికి అనుకూలంగానే వ్యవహరించారు. గోల్వాల్కర్ తర్వాత ఆర్ఎస్ఎస్ అధినేతగా 1973లో బాధ్యతలు బాబాసాహెబ్ దేవరస్ తీసుకున్న తర్వాత తన వారసులు రూపొందించిన లక్ష్యాలను సాధించేందుకు చేయవలసినవన్నీ చేశారు. కుతంత్రాలన్నింటినీ కొనసాగించారు. 2014 తర్వాత కుట్రలు, కుతంత్రాలను వేగిరం చేశారు.

2014 లోక్‌సభ ఎన్నికల్లో పూర్తి మెజారిటీ సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. బీజేపీ పదేళ్ల పాలనలో హిందూమత అజెండాను అనుసరించడం మూలంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో తరచుగా ముస్లిం మైనారిటీలపైన దాడులు జరుగుతూనే ఉన్నాయి. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల తర్వాత కూడా ముస్లింలపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఆకస్మికంగా వివిధ చోట్ల ముస్లింలపై దాడులు పెరిగాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీలలో అధికంగా దాడులు జరుగుతున్నాయని వార్తలు వస్తున్నాయి. చత్తీస్‌ఘర్ రాజధానిలో ఎద్దులను రవాణా చేస్తున్న ముగ్గురు ముస్లింలు ఆవులను రవాణా చేస్తున్నారని ఆరోపిస్తూ 'గో రక్షకులు' చంపివేశారు. అలీఘర్‌లో దొంగతనం చేశాడని ఆరోపిస్తూ ముస్లిం మతస్థుడిని కొట్టి చంపేశారు. మధ్యప్రదేశ్‌లో మండలలో పదకొండుమంది ముస్లింల ఇళ్లను కూల్చివేశారు. వీరి ఇళ్లల్లో బీఫ్ ఉందని ఆరోపిస్తూ బుల్డోజర్లతో కూలగొట్టారు. 24గంటల్లో ఈ దారుణ కృత్యాలను చేశారు. లక్నో నగరంలోని అక్బర్ నగర్‌లో అత్యధికంగా ముస్లింలు నివసిస్తున్నారు. నది ఒడ్డును నిర్మించేపేరుతో వేయికిపైగా ముస్లింల ఇళ్లను బుల్డోజర్‌తో నేలమట్టం చేశారు. గుజరాత్‌లో వదోదరలో ఈ పై ఘటనలు జరిగాయి. ముఖ్యమంత్రి గృహనిర్మాణం



పథకం కింద హిందువులకు కేటాయించిన ప్రాంతంలో ముస్లిం మహిళకు ఒక ఫ్లాట్‌ను కేటాయించారు. ఫలితంగా వేయి ముస్లింల ఇళ్లను కూలగొట్టారు. హిమాచల ప్రదేశ్‌లో సహాన్‌ప్రాంతంలో ముస్లింలకు చెందిన షాపును లూటీ చేశారు. ఈద్-అల్-అధా రోజున ఆవును కోశాడని ఆరోపిస్తూ షాపును ధ్వంసం చేశారు.

గోవును చంపేశారని ఆ ముస్లింపైన కేసు నమోదుచేశారు. ఈ ఘటన జరిగిన తర్వాత 16మంది ముస్లిం షాపు యజమానులను ఆ పట్టణంలో లేకుండా తరిమివేశారు. ఢిల్లీ సంగమ్ విహార్ హిందుత్వ ప్రచారకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడంతో ఆప్రాంతంలోని ముస్లిం నివాసులంతా అక్కడినుంచి మరొకచోటకు వెళ్లిపోయారు. ఒకచోట ఆవుల కళేబరాలను స్వాధీనం చేసుకుని ముస్లింలే చంపేశారని ఆరోపించారు. ఇంత తీవ్రంగా మత దాడులను చేయడానికి కారణం ఆ ప్రాంతంలో బీజేపీకి ఓట్లు వేయలేదన్న దుగ్ధతోనే ఈ పనిచేశారు. హిందుత్వ మతశక్తుల సమీకరణకోసమే పగతో ఈ దుర్మార్గానికి ఒడిగట్టారు.

జూన్ 26వ తేదీన అంతర్జాతీయ మతస్వేచ్ఛ నివేదికలో ఈ అంశాలను పేర్కొన్నారు. అంతేకాదు, దేశంలో మతోన్మాద వాతావరణం మరింత దారుణంగా తయారైందని తెలిపారు. సామాజికస్థాయిలో ఈ హింస తీవ్రతరమైందని, కొన్నిసార్లు పూజలు జరిగేప్రాంతంలో మతఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అంతర్జాతీయ మత స్వేచ్ఛను పరిశీలించే అమెరికా రాయబారి రషద్ హుస్సేన్ ఇలా చెప్పారు. భారతదేశంలో స్థానిక పోలీసులు పూజలు చేసేప్రాంతాల్లో పూజలు జరగకుండా మతోన్మాద సమూహాలు క్రైస్తవులపైన దాడులు సాగించారు. అయితే దాడులకు గురైన వారంతా ఇతర మతాలనుంచి క్రైస్తవంలో చేరారని ఆరోపిస్తూ దాడులు సాగించిన గుంపులకు సహకరించారు. ప్రతీకారంతో ఇతరుల స్వేచ్ఛను హరిస్తున్నారు. మత స్వేచ్ఛ నివేదికను ప్రతిసంవత్సరం రూపొందిస్తారు. అమెరికా ప్రభుత్వ విభాగం ఈ నివేదికను ప్రచురిస్తుంది. అన్నిదేశాల మత స్వేచ్ఛ పరిస్థితిని నివేదికలో ప్రధానంగా పేర్కొన్నారు. గత సంవత్సరం జనవరి 1వ తేదీనుంచి డిసెంబరు 31వరకు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, ఆయా దేశాల్లో మత స్వేచ్ఛ సమాచారం ప్రభుత్వాలు అనుసరించే విధానాలు, మత విశ్వాసాలు, మత ఆధిపత్యం వ్యక్తులకుగల స్వేచ్ఛ లాంటివి ప్రచురిస్తారు. అమెరికా విదేశాంగ శాఖమంత్రి ఆంథోని బ్లింకెన్ ఇండియాలో విద్వేష ప్రసంగాలు, మత మార్పిడి చట్టాలు, ఇళ్ల కూల్చివేతలు, మత మైనారిటీలపై దాడులు తదితర అంశాలు ఆందోళనకర స్థాయిలో పెరిగాయని అన్నారు. 2023 అంతర్జాతీయ మతస్వేచ్ఛ నివేదికను విడుదలచేస్తూ బ్లింకెన్ చేసిన ప్రసంగంలోని మాటలివి. 2022లో 272 మత హింస ఘటనలు జరిగాయి. మత మైనారిటీ గ్రూపులపైన దాడులు చేయడమేకాదు, కొన్ని చోట్ల చంపివేశారు. కొన్నిచోట్ల బెదిరించి ఆయా చోట్లనుండి తరిమివేశారు.

గత సంవత్సరం క్రైస్తవులపైన 731 దాడులు జరిగాయని ఐక్య క్రైస్తవ ఫోరం నివేదికలో పేర్కొన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా మందలించింది. హింసను నివారించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని కోర్టు పేర్కొంది. ఈ ఘటనలపై దర్యాప్తునకు అధికారులను నియమించారు. అలాగే మానవీయసహాయం తప్పక అందే చర్యలు తీసుకోవాలని, కూల్చివేసిన ఇళ్లను, ఆలయాలను తిరిగి నిర్మించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కొన్నిసార్లు హిందూ పండగల సందర్భంగా ఉత్సవాలను నిర్వహించినప్పుడు కూడా హింసాయుత ఘటనలు జరుగుతున్నాయి. మెజారిటీ ముస్లింలు ఉన్నప్రాంతాల్లో హిందు పండుగలకు జరిగే ఊరేగింపులు సందర్భంగా అల్లర్లు జరుగుతున్నాయి.

గత డిసెంబరులో పార్లమెంటు కొత్త క్రిమినల్ చట్టాలను ఆమోదించింది. ఈ చట్టాలను ప్రజలను మరింతగా ఇబ్బందులు పెట్టడానికే చేశారన్న విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. ముస్లిమేతర మహిళలను హిందువులు వివాహం చేసుకున్నప్పుడు ముస్లింలనే శిక్షించేందుకు ఈ చట్టాలను ఉపయోగిస్తారని మీడియా వ్యాఖ్యాతలు అంచనావేస్తున్నారు. ప్రత్యర్థిపక్షాలు ఈ చట్టాలు అనవసరమైనవని, ప్రత్యర్థులను శిక్షించడానికే ఇవి ఉపయోగిస్తారని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానమంత్రి మోదీ ఒకే విధమైన పౌరస్మృతి(యుసిసి) చట్టాన్ని తీసుకురావాలని ఇది దేశవ్యాప్తంగా అమలు జరపాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో వేర్వేరుగా వ్యక్తిగత చట్టాలు ఉన్నాయి. వివిధ మతస్థులకు ఈ చట్టాలను అమలు చేస్తున్నారు. ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు, గిరిజనులు తదితర మతాలకు భిన్న చట్టాలున్నాయని దేశం మొత్తానికి ఒకే చట్టం ఉండాలని మోదీ కోరుకుంటున్నారు. దేశాన్ని "హిందు రాష్ట్రం"గా మలిచేందుకే కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని అనేక రాష్ట్రాలు ఒకే పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నారు.

మాతృభాషలో బోధించాలి

హరి వెంకట రమణ

విద్య అసలు లక్ష్యం సమాధానాలను అందించడం కాదు, ప్రశ్నలను సంధించడం అంటారు అమెరికన్ రచయిత, ఉపాధ్యాయురాలు హెలెన్ కెల్లర్. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో విద్యా విధానాలపై అనేక ప్రశ్నలు, కావలసిన సమాధానాలు వెతకవలసిన సమయం. ఐదేళ్ల సంస్కరణల్లో మంచి చెడూ చర్చించి ఇప్పుడు చేయవలసిన దిద్దుబాట్లు గురించి చర్చించడం అవసరం. కొత్త ప్రభుత్వం కొలువు తీరాక రెండు ముఖ్య విషయాలు అందరూ చర్చించారు. దీనిపై తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. అవి ఒకటి మెగా డీఎస్సీపై సంతకం, రెండు విద్యా దీవెన కింద పిల్లలకు ఇచ్చిన స్కూల్ బ్యాగులపై గత ముఖ్యమంత్రి బొమ్మ వున్నా వాటిని కొనసాగించమనడం.

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడం అనేది ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం మొదటగా 2015 లో ప్రారంభించింది. దీనిని "ఢిల్లీ విద్యా విప్లవం"గా అభివర్ణించారు. ఇది అందరి దృష్టిని ఆకర్షించింది. స్కూళ్లకు మంచి రంగులు, పిల్లలకు సరిపడా ఫర్నిచర్, మార్గదర్శకులైన గురువులు, గణనీయమైన మార్కులు ఈ విద్యాసంస్కరణల ప్రధాన ఉద్దేశంగా చెపుతారు. పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లీష్ మీడియంలో బోధనతో కూలీ నాలీ చేసుకొని ప్రైవేటుబడుల్లో చేర్చే తల్లి తండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం మొదలు పెట్టారు. విద్యార్థులకు వారి మాతృభాషలో బోధించినప్పుడు, పిల్లలు సులభంగా అర్థం చేసుకొంటారు అది నిర్వివాదాంశం. కానీ తల్లి తండ్రుల ఇంగ్లీష్ బోధనా ఆసక్తులు, కోరికలు కూడా పరిగణనలోకి తీసుకొని ప్రాథమిక స్థాయి నుంచి తెలుగు ఇంగ్లీష్ రెండు మాధ్యమాలు తప్పనిసరిగా ఉంచాలి. విద్య ఉమ్మడి అంశం కనుక కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానాన్ని శరవేగంగా అమలు చేయవలసిన అవసరంలేదు. జాతీయ విద్యావిధానం, 2020 ప్రకారం "ప్రస్తుత నేర్చుకునే ఫలితాలు, కావాల్సిన వాటి మధ్య అంతరాన్ని చిన్ననాటి విద్య నుంచి ఉన్నత విద్య ద్వారా వ్యవస్థలోకి అత్యధిక నాణ్యత,సమగ్రతను తీసుకురావడానికి స్థూల స్థాయి సంస్కరణలను చేపట్టాలి. జాతీయ విద్యా విధానం, ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై నేర్చుకునేందుకు, విద్యా వ్యవస్థలో సమర్థవంతమైన వనరులు, పాలన ఆవశ్యకతపై పూర్తి దృష్టి సారించింది. ప్రాథమిక పాఠశాలల నుంచి అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలకు బదిలీ చేయడంతో ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కావలసిన ఫౌండేషన్ స్థాయి బోధన



సంక్షోభంలో పడింది. ఇందువలన చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హై స్కూల్, ప్లస్‌టులో గత విద్యా సంవత్సరంలో చాలా నాసిరకం ఫలితాలు వొచ్చాయి. వీటికంటే ఇంటర్మీడియేట్ కళాశాలలు మరిన్ని అందుబాటులో ఉంచడం, లేదా వీటిలో నైపుణ్యం గల లెక్చరర్లను నియమించడం మంచిది. ప్రాథమిక పాఠశాలలను, కిలోమీటర్ పరిధిలోని పాఠశాలలను అలాగే ఉంచాలి. నాలుగు, అయిదు తరగతులను హై స్కూల్‌లో విలీనం చేయకూడదు. ఇందువలన చిన్న పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అలాగే హైస్కూల్, ప్లస్ టు లో గత విద్యా సంవత్సరంలో చాలా నాసిరకం ఫలితాలు వొచ్చాయి. వీటికంటే ఇంటర్మీడియేట్ కళాశాలలను మరిన్ని అందుబాటులో ఉంచడం, లేదా వీటిలో నైపుణ్యంగల లెక్చరర్లను నియమించడం మంచిది. ఇక సీబీఎస్‌సీ అమలు విషయానికొస్తే దేశంలో బహుశా ఆంధ్రప్రదేశ్ మొదటి రాష్ట్రం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వెయ్యి పాఠశాలల్లో ఎనిమిదవ తరగతితో ప్రారంభమయ్యే గత విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్‌ను రూపొందించారు. ఈ వ్యవస్థ 2024-25లో పదవ తరగతికి విస్తరణ అవుతుంది. ఈ ప్రయత్నం మంచిదే కానీ ప్రస్తుత ప్రభుత్వం ఈ విధాన అమలుకు మరిన్ని మెరుగైన మార్గాలను అన్వేషించాలి. అమలుకు కొత్త ప్రణాళికలు రూపొందించాలి. సీబీఎస్‌సీ సిలబస్ బోధించడానికి నైపుణ్యాలు గల ఉపాధ్యాయులను ఎంపిక చేయాలి. ఇప్పటికే కొనసాగుతున్న ఉపాధ్యాయులకు మరిన్ని నైపుణ్యాలను సమకూర్చాలి. వివాదాస్పదమైన బైజూస్ కంటెంట్‌తో కూడిన 5,18,740 ట్యాబ్‌లను ఉపాధ్యాయులతో పాటు 4.59 లక్షల మంది 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేయడానికి దాదాపు రూ.686 కోట్లు ఖర్చు చేశారు. అయితే ఇందుకు బదులుగా రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణా సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) పాఠ్యాంశాల ఆధారిత డిజిటల్ సామాగ్రిని రూపొందిస్తే మంచిది. దీనికి స్థానిక రచయితలను, చిత్రకారులను, యానిమేటర్లను వినియోగిస్తే కంటెంట్‌లో స్థానికత కనిపిస్తుంది. విద్యార్థులు నేర్చుకోవడానికి ఆసక్తి కనబరుస్తారు.

ఉపాధ్యాయులకు యాప్‌ల పనిభారం తగ్గించి పూర్తి సమయం బోధనకు, పాఠ్యాంశాల ప్రణాళికకు, కృత్యాల ఆధారంగా బోధించడానికి సమయం ఇవ్వాలి. సమగ్ర శిక్షణ కనెక్ట్ టు ఆంధ్ర, సేవ్ ద చిల్డ్రన్ సాంకేతిక సహకారంతో ఏర్పాటవుతున్న స్టెమ్ (సైన్స్ టెక్నాలజీ, ఇంగ్లీష్, మాథమాటిక్స్) లాబొరేటరీల సద్వినియోగం ద్వారా విద్యార్థులకు క్లిష్టమైన పాఠ్యంశాలను అనుభవాత్మక విద్య ద్వారా బోధనను అత్యంత సులభతరం చేయవచ్చు. పిల్లల కోసం పనిచేసే సంస్థలు సదుద్దేశంతో ప్రారంభించిన లెర్నింగ్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రాం(లిప్) ఇస్తున్న మంచి ఫలితాలు మదింపు చేసి, ఇది మరింత మెరుగ్గా ఎలా చేయగలమో ఆలోచన చేయాలి. ఆసెర్ (యాన్యువల్ స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) 2023 లో ఇచ్చిన బియాండ్ బేసిక్స్ అనే నివేదిక చూస్తే దాదాపు 25శాతం మంది ఇప్పటికీ తమ ప్రాంతీయ భాషలో రెండో తరగతి స్థాయి వచనాన్ని సరళంగా చదవలేరు. అంకగణితం, ఆంగ్ల పఠనంలో ఇస్తున్న నివేదిక చూస్తే మన పిల్లల విద్యా నైపుణ్యాలు చాలా తక్కువ స్థాయిలో వున్నాయి, అలాగే ప్రపంచ బ్యాంకు లెర్నింగ్ పావర్టీ ఇండెక్స్ ప్రకారం, భారతదేశంలోని 55 శాతం మంది పిల్లలు ఈ రోజు ప్రాథమిక వయస్సు చివరిలో చదవడంలో నైపుణ్యం కలిగిలేరు. ఈ ఫలితాలలో మన పిల్లలూ వున్నారు.

ఇక భాషా నైపుణ్యాలు మా క్షేత్రస్థాయి పరిశీలనలో చాలా మంది ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పదవతరగతి చేరుకున్నా తెలుగు, ఇంగ్లీష్ తప్పులు లేకుండా రాయడం రావటం లేదని తేలింది. భాష పునాది మీదనే మిగతా విద్య అంతా ఉంటుంది. ఇంత బడ్జెట్ కేటాయించి, టీచర్లను ఏడిపించి, పాఠశాలలను మూసివేసి, పిల్లల విద్యపై సాధించినది ఏమిటి ? మొదటి తరగతిలో ఉత్తీర్ణత, రాంకులు సంగతి సరే. నిజమైన విలువలతో కూడిన విద్య అందుతుందా ? లేదా ఇంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరేనా ? ఆలోచించి ప్రాథమిక స్థాయి నుంచి వీటిని సరిదిద్దాలి. లేదా ఈ పిల్లలు ఇలాగే ఇంటర్లు, డిగ్రీలు పూర్తిచేసి అక్షర దోషాలతో రాస్తుంటారు. గత ప్రభుత్వం కేవలం కొంతమంది అధికారుల మాటలతోనే విద్యా సంస్కరణలు చేపట్టింది, పిల్లల వాస్తవ అవసరాలు ఏమిటి ? వారి ఆసక్తులు ఏమిటి ? ఈ రంగంలో దశాబ్దాలుగా పనిచేస్తున్న క్షేత్రస్థాయి కార్యకర్తలు ఏం చెపుతున్నారు ? అని అడిగిన వారు, విన్నవారు వున్నారా ? కానీ మన సమాజంలో అన్ని రకాల పిల్లలూ వుంటారు, అందరినీ పాఠశాల గొడుగులోకి తేవడం అందరి బాధ్యత.

భారత ప్రభుత్వ జాతీయ యువజన అవార్డు గ్రహీత
సెల్: 9866084124

అసోంలో వరద బీభత్సం

16 లక్షల మంది నిరాశ్రయులు

రెండు వేల గ్రామాలు జలదిగ్భందాల

గుహవతి: అసోంలో వరద బీభత్సం కొనసాగుతోంది. బుధవారం మరో 8మంది మృతిచెందగా, 27జిల్లాల పరిధిలోని 16.25 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. ఈ మేరకు అధికారులు ఓ ప్రకటన చేశారు. సోనిత్‌పూర్ జిల్లా తేజ్‌పూర్‌లో ఇద్దరు, మోరిగావ్, దిబ్రుగఢ్, దరాంగ్, గోలాఘాట్, బిస్వనాథ్, తిన్‌సుకియా ప్రాంతాల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందినట్లు చెప్పారు. 24జిల్లాల పరిధిలోని 515 వరద సహాయక శిబిరాల్లో దాదాపు 4లక్షల మంది తలదాచుకుంటున్నారు. 8,400 మందిని సహాయక బృందాలు కాపాడినట్లు అధికారులు చెప్పారు.

ప్రస్తుతం 2,800 గ్రామాలు వరదగుప్పిట్లో చిక్కుకోగా, 42,478 హెక్టార్లలో వివిధరకాల పంటలు నీట మునిగినట్లు తెలిపారు. వరదల కారణంగా వివిధ జిల్లాల్లో రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతినట్లు చెప్పారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు అసోంలో సంభవించిన ప్రకృతి విపత్తుల్లో చనిపోయినవారి సంఖ్య 56కు చేరినట్లు అధికారులు తెలిపారు.

ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటన

వరద ప్రభావిత ప్రాంతాల్లో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పర్యటించారు. ఖానా నదిపై నిర్మించిన ధారాపుర్ జంగ్రాబార్ డ్యామ్‌లో దెబ్బతిన్న స్లూయిస్ గేట్‌ను పరిశీలించారు. పలు ప్రాంతాలలో దెబ్బతిన్న రోడ్లు, ఆనకట్టల మరమ్మతుల పనులను త్వరగతిన పూర్తి చేస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. రెండో విడత వరదలకు అరుణాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్టే కారణమని ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తెలిపారు. చైనా, భూటాన్ నుంచి కూడా వరద వస్తోందని చెప్పారు. కామ్రూప్ జిల్లాలో వరద పరిస్థితిపై సమీక్షించిన ఆయన, ఎన్డీఆర్ఆఫ్ బృందాలు 24 గంటలు సహాయ చర్యలు చేపడుతున్నాయనని వెల్లడించారు.

హిమాచల్‌లో అతి భారీవర్షాలు

115 రోడ్లు మూసివేత

సిమ్లా: హిమాచల్‌ప్రదేశ్ అంతటా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కొండచరియలు విరిగిపడి రహదారులు మూసుకుపోయాయి. శుక్రవారం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని సిమ్లా వాతావరణ కేంద్రం తెలిపింది. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల నేపథ్యంలో దాదాపు 115 రహదారులను అధికారులు మూసివేశారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులున్నాయి. మండిలో 107, చంబాలో నాలుగు, సోలన్‌లో మూడు, కాంగ్రా జిల్లాలో ఒకటి సహా మొత్తం 115 రోడ్లు వర్షాల కారణంగా మూసివేశారు. వాహనాల రాకపోకలు జరగకుండా ముందస్తుగా నిలిపివేశారు. ఇక రాష్ట్రంలో 212 ట్రాన్స్‌ఫార్మర్‌లకు అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే చండీగఢ్-మనాలి నాలుగు-లేన్ల రహదారిలో మండి నుంచి పండోహ్ మధ్య పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ మార్గంలో వన్-వే ట్రాఫిక్‌ను మాత్రమే అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి రిటైనింగ్ వాల్‌ను నిర్మించినప్పటికీ రెండు అడుగుల మేర పడిపోయిందని, నిర్మాణ నాణ్యతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని ప్రాజెక్ట్ మేనేజర్ రాజ్ శేఖర్ తెలిపారు. ఇక శని, ఆదివారాల్లో (జులై 6 మరియు 7) భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పసుపు హెచ్చరిక జారీ చేసింది. బలమైన గాలులు, వర్షం కారణంగా తోటలు, ఉద్యానవనాలు, పంటలకు నష్టం కలిగే అవకాశాలున్నాయని తెలిపింది. కచ్చా ఇళ్లు, గుడిసెలకు స్వల్ప నష్టం వాటిల్లుతుందని హెచ్చరించింది. రాష్ట్ర రాజధాని సిమ్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు 84 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెట్లు నేలకూలడంతో అనేక రోడ్లపై రాకపోకలకు అంతరాయం కలిగింది.

వన్యప్రాణుల మృతి

మరోవైపు భారీ వర్షాలకు కజిరంగ జాతీయ పార్కు టైగర్ రిజర్వ్ కేంద్రాలు వరద నీటిలో మునిగిపోయాయని అటవీ అధికారులు వెల్లడించారు. 233 అటవీ శిబిరాల్లో 178 చోట్ల ఐదు అడుగుల మేర నీరు ప్రవహిస్తోందని వెల్లడించారు. ముంపునకు గురైన శిబిరాల్లో 80 అగ్రాటోలి, కజిరంగ ప్రాంతాలలో ఉన్నాయని తెలిపారు. వరద నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో తొమ్మిది శిబిరాల్లోని ఫారెస్టు గార్డులు వెనక్కి వచ్చేశారని అధికారులు చెప్పారు. వరద నీటిలో మునిగి ఒక ఖడ్గమృగం సహా ఎనిమిది జంతువులు మృతి చెందాయని వెల్లడించారు. మరో 44 జంతువులను కాపాడినట్లు వివరించారు. ఈ పరిస్థితిపై ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమీక్ష నిర్వహించారు. పార్కులోని జంతువులను రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించాలని ఆదేశించారు. గాయాల పాలైన జంతువులకు చికిత్స చేసేందుకు మొబైల్ వెటర్నరీ క్లినిక్స్‌ను ఏర్పాటు చేయాలని అటవీ అధికారులకు సూచించారు.

ఉత్తరాఖండ్‌ను ముంచెత్తుతున్న వర్షాలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌ను వర్షాలు ముంచెత్తుతుండటంతో ప్రధాన నదులన్నీ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. చంపావత్ , అల్మోరా , పిథోర్‌గఢ్, ఉధమ్‌సింగ్ నగర్‌తోపాటు కుమాన్ తదితర ప్రాంతాల్లో మరో వారంరోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని ఉత్తరాఖండ్ వాతావరణ శాఖ అధికారులు స్పష్టం చేశారు. డెహాడూన్, తేహ్రి, హరిద్వార్ తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో గంగా, అలకనంద, భాగీరథీ , శారద , మందాకిని, కోసి నదుల్లో నీరు భారీగా ప్రవహిస్తోంది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ నదులను ఆనుకొని ఉన్న దాదాపు 100 రహదారులను అధికారులు మూసివేశారు. గత 24 గంటల్లో అల్మోరాలోని చౌకుతియా ప్రాంతంలో 72.5 మి.మీ వర్షపాతం నమోదైంది. లోహాఘట్‌లో 59 మి.మీ, చంపావత్‌లో 45 మి.మీ, కాశీపూర్‌లో 42 మి.మీ, హల్ద్వానీలో 31 మి.మీ వర్షపాతం నమోదైంది. అలకనంద నది ఉప్పొంగడంతో రుద్రప్రయాగ్ వద్ద నది ఒడ్డున ఏర్పాటుచేసిన 10 అడుగుల శివుడి విగ్రహం నీట మునిగింది. ఈ నేపథ్యంలో అక్కడి వాతావరణ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించారు. నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. నైనీతాల్, పౌడీ జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఎలాంటి విపత్తు తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను జిల్లా మెజిస్ట్రేట్లు ఆదేశించారు.

త్వరలో హత్రస్‌కు రాహుల్‌గాంధీ

న్యూదిల్లీ: యూపీలోని హత్రస్ తొక్కిసలాటలో మృతులు, బాధితుల కుటుంబాలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పరామర్శించనున్నారు. ఇందుకోసం త్వరలో ఆయన హత్రస్‌కు వెళ్లనున్నారు. ఘటనా ప్రాంతంలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు వెల్లడించారు. ఇది దురదృష్టకర ఘటన అని, హత్రాస్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పర్యటనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. రాహుల్ హత్రస్‌కు వెళ్లి బాధితులతో మాట్లాడతారని వేణుగోపాల్ పేర్కొన్నారు. కాగా భోలే బాబా సత్సంగ్‌లో మంగళవారం జరిగిన తొక్కిసలాటలో మృతుల సంఖ్య 121కు చేరుకుంది. అనేక మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఘటనపై జ్యుడీషియల్ విచారణకు ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. ఈ ఘటనలో నిందితుడు భోలే బాబాపై ఆగ్రా, ఎతావాహ్, కస్‌గంజ్, ఫరూఖాబాద్, దూసా ప్రాంతాల్లో ఐదు లైంగిక దాడి కేసులు నమోదైన విషయం వెలుగులోకి వచ్చింది. 1997లో ఓ కేసులో అరెస్టయి కొన్నాళ్లు జైలు శిక్ష కూడా అనుభవించినట్టు సమాచారం. ఆయన జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాతనే తన గ్రామంలో ఓ ఆశ్రమాన్ని ప్రారంభించాడు. తనకు గురువు ఎవరూ లేరని చెప్పుకునే భోలే బాబా.. కాషాయానికి బదులుగా తెల్లటి సూటు, బూట్లు, నల్ల కండ్లద్దాలు ధరిస్తూ ప్రత్యేకంగా కనిపిస్తుంటాడు.తనను నమ్మే వారిని భోలే బాబా అనేక మూఢ నమ్మకాలతో ముంచేశాడని తెలుస్తోంది. ముఖ్యంగా తాను నిర్వహించే సత్సంగ్‌లలో ఇచ్చే పవిత్ర జలం తాగితే భక్తుల సమస్యలు తీరిపోతాయనే ప్రచారం చేయించాడు. తన పాదధూళి కూడా పవిత్రమైనదని, బాబా నడిచిన నేలపై మట్టిని తాకినా అదృష్టం వరిస్తుందనే నమ్మకాన్ని సృష్టించాడు. ఇవి నమ్మి ఉత్తరప్రదేశ్‌తో పాటు ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్‌తో పాటు దిల్లీ నుంచి పెద్ద ఎత్తున జనం భోలే బాబా దర్శనం కోసం వచ్చే వారు.

హత్రస్ ఘటనపై కంటితుడుపు చర్యలు: ఆర్జేడీ

పాట్నా: హత్రస్ తొక్కిసలాట ఘటన విషయంలో కాషాయ పాలకుల తీరుపై విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ఈ తరహా ప్రమాదాలపై ఎన్ని కమిటీలు వేస్తారని ఆర్జేడీ నేత మనోజ్ ఝూ ప్రశ్నించారు. కంటి తుడుపు చర్యల వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. రెండ్రోజుల హడావిడి అనంతరం ఈ వ్యవహారంపై అసలు చర్చే జరగదన్న సంగతి మనందరికీ తెలుసునని ఎద్దేవా చేశారు. భారత్ ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో జనం హాజరవుతారని స్థానిక అధికారులకు తెలియదా అని ఆయన నిలదీశారు. దురదృష్టకర ఘటన చోటుచేసుకున్న అనంతరం కంటితుడుపు చర్యలు చేపడుతున్నారని విమర్శించారు.

అత్యంత విలాసంగా భోలేబాబా ఆశ్రమం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని హత్రస్‌లో నిర్వహించిన సత్సంగ్ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 123 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నారు. ఈ ఘటనపై స్పందించిన అధికారులు భోలే బాబా ఆశ్రమంలో తనిఖీలు చేపట్టారు. భోలేబాబా ఆశ్రమం దాదాపు 13 ఎకరాల్లో ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆశ్రమం ఫైవ్ స్టార్ హోటల్‌ను తలపించేలా ఉన్నట్లు తెలిసింది. భోలే బాబా అని పిలవబడే నారాయణ్ సాకర్ హరి మెయిన్‌పురి బిచ్వాలో కోట్ల విలువైన విలాసవంత ఆశ్రమంలో నివసిస్తున్నారు. 'ప్రవాస్ ఆశ్రమం' అని పిలవబడే ఈ భవనం అలీగఢ్-గుజరాత్ రహదారిపై 13 ఎకరాల స్థలంలో నిర్మించారు. ఈ విలాస భవనంలో అన్ని ఫైవ్-స్టార్ సౌకర్యాలతో పాటు బాబాకు చెందిన లగ్జరీ కార్లను ఉంచడానికి పెద్ద గ్యారేజీ ఉంది. ఈ ఆశ్రమంలో బాబా కోసం ప్రత్యేకంగా ఆరు గదులను కేటాయించినట్లు వెల్లడైంది. ఆశ్రమం కోసం భూమిని మెయిన్‌పురికి చెందిన వినోద్‌బాబు విరాళంగా ఇచ్చారని తేలింది. భోలే బాబా తన ఆశ్రమ ద్వారం వెలుపల 200 మంది పెద్ద దాతల జాబితాను కూడా పెట్టించారు. జాబితాలో మొదటి పేరు వినోద్‌బాబు. ఆ తర్వాత రూ.2.5 లక్షల నుంచి రూ.25 వేల వరకు విరాళాలు ఇచ్చిన 199 మంది పేర్లు ఉన్నాయి. రూ.10 వేల లోపు విరాళం ఇచ్చిన దాతల పేర్లు జాబితాలో లేవు. షాజహాన్‌పూర్, ఆగ్రా వంటి ఉత్తరప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలలో భోలేబాబాకు కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని కూడా వెలుగులోకి వచ్చింది. అంతేకాకుండా, ఆశ్రమం వెలుపల ఉన్న భూమిలో భోలే బాబా తన సత్సంగాలు (మతపరమైన సమావేశాలు) నిర్వహించేవాడు. ఈ భూమిని పేద గ్రామస్తులు ఆశ్రమం కోసం తనకు విరాళంగా ఇచ్చినట్లు భోలే బాబా గతంలో పేర్కొన్నారు. ఆశ్రమంలో కీలక పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా బాబాకు ఆశ్రమాలు ఉన్నాయి. వీటి విలువ రూ. కోట్లలో ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ప్రస్తుతం ఆశ్రమం వెలుపల పోలీసు సిబ్బందిని మోహరించారు. పోలీసుల ఎఫ్ఐఆర్‌లో ఇంకా పేరు పెట్టని భోలే బాబా ఆశ్రమంలో కనిపించలేదు. ఎఫ్ఐఆర్‌లో 'ముఖ్య సేవాదార్' దేవ్ ప్రకాష్ మధుకర్, ఇతర నిర్వాహకులను నిందితులుగా పేర్కొన్నారు. 80,000 మందికి పరిపాలన అనుమతి ఇచ్చినప్పటికీ 2.50 లక్షల మందికి పైగా మతపరమైన సమావేశానికి హాజరయ్యారని ఎఫ్ఐఆర్ పేర్కొంది.ఈ దుర్ఘటనపై ప్రాథమిక నివేదిక ప్రకారం, వేలాది మంది అనుచరులు ఆశీర్వాదం కోసం, బోధకుడి పాదాల చుట్టూ ఉన్న మట్టిని సేకరించడానికి వెళుతుండగా, వారిని భోలే బాబా భద్రతా సిబ్బంది నెట్టారు. దాని కారణంగా , చాలా మంది కింద పడిపోయారు, ఫలితంగా తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటన వెనుక వ్యతిరేక శక్తులు ఉన్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బుధవారం భోలే బాబా ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు.

గాలింపు తీవ్రతరం

తొక్కిసలాట ఘటన తర్వాత పరారీలో ఉన్న భోలే బాబాను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మెయిన్‌పురిలో బాబాకు చెందిన ఆశ్రమంలో సోదాలు నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. పోలీసు బలగాలను అక్కడే మోహరించినా, ఇంతవరకు బాబా ఆచూకీ లభ్యం కాలేదు. 'ఆశ్రమంలో 40-50 మంది బాబా అనుచరులు ఉన్నారు. అతడి కోసం వెతికినా ఎక్కడ కనిపించలేదు. ఇప్పటి వరకు బాబా ఆచూకీ గురించి తెలియదు' అని డీఎస్పీ సునీల్ కుమార్ తెలిపారు.

మంత్రి పదవికి కిరోడిలాల్ మీనా రాజీనామా

ఎన్నికల ప్రచారంలో సవాలు విసరడమే కారణం

జైపూర్: బీజేపీ సీనియర్ నేత, రాజస్థాన్ రాష్ట్ర మంత్రి కిరోడి లాల్ మీనా తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన బాధ్యత వహించిన స్థానాల్లో బీజేపీ ఓటమిపాలవడమే ఇందుకు కారణం. వివరాల్లోకి వెళితే... కిరోడి మీనా రాజస్థాన్ ప్రభుత్వంలో కీలక పదవిలో కొనసాగుతున్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు లోక్‌సభ ఎన్నికల్లో దౌసా సహా ఏడు స్థానాలకు ఆయన బాధ్యత వహించారు. ఎన్నికల్లో ఏ ఒక్క స్థానంలో బీజేపీ ఓడిపోయినా తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని ప్రచార సమయంలో వాగ్దానం చేశారు. అయితే, అంచనాలకు భిన్నంగా ఫలితాలు వెలువడ్డాయి. రాష్ట్రంలోని 25 స్థానాలు ఉండగా 14 ఎంపీ స్థానాలను మాత్రమే ఆ పార్టీ గెలుచుకోగలిగింది. దౌసా సహా ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయ పతాకం ఎగురవేసింది. మిగితాచోట్ల ఇతర పార్టీలు గెలుపొందాయి. దీంతో తాను చేసిన వాగ్దానం ప్రకారం కిరోడి మీనా తన పదవికి రాజీనామా చేశారు. 10 రోజుల క్రితమే రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మకు సమర్పించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కాగా, గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాధోపూర్ నుంచి మీనా గెలుపొందారు. 200 నియోజకర్గాలకు గాను బీజేపీ 115 స్థానాలను కైవసం చేసుకొంది. కాంగ్రెస్ 66 సీట్లకే పరిమితమైంది. గతంలో రాష్ట్ర కేబినెట్‌లో వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవనం, విపత్తు నిర్వహణ, సహాయ, పౌర రక్షణశాఖలకు మంత్రిగా కిరోడి వ్యవహరించారు.

టీఎంసీ నేత ముకుల్‌రాయ్‌కు బలమైన గాయం

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ సీనియర్ నేత, రైల్వే మాజీ మంత్రి ముకుల్ రాయ్ స్నానాలగదిలో జారిపడ్డారు. తలకు బలమైన గాయం కావడంతో ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని, డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నారని ముకుల్ రాయ్ కుమారుడు సుభ్రంగంషూ రాయ్ తెలిపారు. బుధవారం రాత్రి ఇంట్లోని బాత్‌రూమ్‌లో కాలుజారి పడ్డారని, దీంతో తలకు గాయమైందని చెప్పారు. వెంటనే వాంతి చేసుకున్నారని వెల్లడించారు. ఆయన ఇప్పటికే నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన పరీక్షలన్నీ పూర్తిచేశారని, వాటి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. దానినిబట్టి వైద్యులు తదుపరి చికిత్స ప్రారంభిస్తారని వెల్లడించారు. కాగా, 70 ఏండ్ల ముకుల్ రాయ్ టీఎంసీ వ్యవస్థాపకుల్లో ఒకరు. ఆయన 2017లో బీజేపీలో చేరారు. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్తర కృష్ణానగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే తర్వాత సొంతగూటికి చేరుకున్నారు.

బీహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

16 రోజుల్లో 12వ ఘటన

పాట్నా: బీహార్‌లో వంతెనలు పేకమేడలా ఒకదాని తర్వాత మరొకటి కూలిపోతున్నాయి. గత 24 గంటల్లోనే సరన్ ప్రాంతంలో రెండు వంతెనలు కూలగా... తాజాగా అలాంటి సంఘటన మరొకటి చోటు చేసుకుంది. 16 రోజుల్లో ఇది 12వ సంఘటన. ఈ వంతెనను 15 ఏళ్ల క్రితం నిర్మించారని, బ్రిడ్జి కూలిన ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని జిల్లా మెజిస్ట్రేట్ అమన్ సమీర్ క్లారిటీ ఇచ్చారు. గండకి నదిపై నిర్మించిన ఈ వంతెన సరన్‌లోని కొన్ని గ్రామాలను సివాన్ జిల్లాతో కలుపుతుంది. 'సరన్ ప్రాంతంలో గురువారం కూలిన చిన్న వంతెనను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. ఈ వంతెన కూలిపోవడానికి ఖచ్చితమైన కారణాలేంటో ఇంకా తెలియరాలేదు. అయితే ఇటీవల అక్కడ డీసిల్టింగ్ పని జరిగింది. ఈ వంతెన కూలడానికి గల కారణాలు తెలుసుకునేందుకు విచారణ చేపట్టాం. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు' అని అమన్ సమీర్ మీడియాకు తెలిపారు. ఈమధ్య కాలంలో జిల్లాలో చిన్న వంతెనలు వరుసగా కూలిపోతున్నాయని అందుకు గల కారణాలను తెలుసుకునేందుకు ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించామని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇదిలావుండగా, జిల్లాలో గత కొన్ని రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోందని, దాని వల్లే ఈ వంతెన కూలిపోయి ఉండొచ్చని స్థానికులు చెబుతున్నారు. కాగా, గత 16 రోజుల్లో సివాన్, సరన్, మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లో కలుపుకొని మొత్తం 12 వంతెనలు కూలిపోయాయి. దీంతో బీహార్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే సీఎం నితీశ్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పాత వంతెనలపై సర్వే నిర్వహించాలని, తక్షణ మరమ్మత్తులు అవసరమయ్యే వాటిని గుర్తించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు నిర్మాణ శాఖ ఇప్పటికే వంతెన నిర్వహణ విధానాన్ని సిద్ధం చేసిందని, గ్రామీణ పనుల శాఖ తక్షణమే తన ప్రణాళికను రూపొందించాలని ఆయన చెప్పారు.

'నీట్' రద్దు చేయాల్సిందే

లీకేజీతో సన్నగిల్లిన నమ్మకం

విద్యను మళ్లీ రాష్ట్ర జాబితాలో చేర్చాలి: నటుడు విజయ్

చెన్నై: వైద్య విద్యా కోర్సులు చదవాలని ఆకాంక్షించే గ్రామీణ విద్యార్థులకు తీరని నష్టం కలిగించే నీట్ రద్దు చేయాల్సిందేనని తమిళగ వెట్రి కళగం నాయకుడు, ప్రముఖ సినీ నటుడు విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక తిరువాన్మియూరులోని రామచంద్రా కన్వెన్షన్ కల్యాణ మండపంలో రెండో విడతగా 19 జిల్లాలకు చెందిన 107 శాసనసభ నియోజకవర్గాల్లోని పదో తరగతి, ప్లస్-2 పరీక్షలలో ఉత్తీర్ణులైన 640 మంది విద్యార్థులకు నగదు, విద్యా ఉపకరణాలను పంపిణీ చేశారు. విజయ్ మాట్లాడుతూ... నీట్ వల్ల రాష్ట్రంలోని విద్యార్థినీ విద్యార్థులకు ప్రత్యేకించి మారుమూల గ్రామాల్లోని నిరుపేద విద్యార్థులు, బీసీ, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులంతా తీవ్రంగా నష్టపోతున్నారని, వైద్యకోర్సులకు దూరమవుతున్నారన్నదే నూటికి నూరుపాళ్లు నిజమన్నారు. ఒక దేశం, ఒక సిలబస్, ఒకే పరీక్ష అనే సిద్ధాంతంలో విద్యనభ్యసించాలనే ఆశయానికే వ్యతిరేకమైనదన్నారు. ఒక్కో రాష్ట్రానికి తగినట్లు వేర్వేరు సిలబస్‌లు అమలులో ఉండటమే శ్రేయస్కరమన్నారు. రాష్ట్ర హక్కుల కోసమే తానీ ప్రకటన చేయడం లేదని, విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు రావాలని, విద్య అందరికీ అందుబాటులో ఉండాలన్నదే తన ఆశయమన్నారు. ప్రాంతీయ భాషలో రాష్ట్ర సిలబస్ ద్వారా చదివే విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో పరీక్షలు జరుపటం అన్యాయమన్నారు. అందులోనూ రాష్ట్రంలో ప్లస్-2 వరకు రాష్ట్ర సిలబస్‌లో చదివిన కుగ్రామాల విద్యార్థులు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌లో తయారైన నీట్ పరీక్ష సులువుగా ఎలా రాస్తారని విజయ్ ప్రశ్నించారు. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీతో ఆ పరీక్షపై ఉన్న నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందన్నారు. నీట్ లీకేజీ తర్వాత దేశమంతటా నీట్ అనవసరమనే భావనలే ఏర్పడుతున్నాయన్నారు. వీటన్నింటికీ పరిష్కారమార్గంగా రాష్ట్ర ప్రభుత్వం నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని శాసనసభలో చేసిన తీర్మానానికి విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నీట్ మినహాయింపును కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటిస్తుందని తాను భావించడం లేదని, రాష్ట్ర ప్రజల ఆశయాన్ని గుర్తించి వీలైనంత త్వరగా నీట్ రద్దు చేయడమే మంచిదని చెప్పారు. విద్యను గతంలోవలే రాష్ట్ర జాబితాలో చేర్చితే ఆయా రాష్ట్రాల సిలబస్‌లో చదివిన విద్యార్థులకు, ఆ సిలబస్‌లోని అంశాలతో నిర్వహించే పోటీ పరీక్షలు సులువుగా రాయగలుగుతారని విజయ్ అన్నారు. విద్య ఉమ్మడి జాబితాలో ఉండటం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే అంశాలను బుట్టదాఖలు చేయడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని విజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుపుతున్న ఎయిమ్స్, జిప్మర్ తదితర విద్యా సంస్థల్లో నీట్ జరుపుకుంటే తనకెలాంటి అభ్యంతరం లేదని కూడా విజయ్ స్పష్టం చేశారు.

టీఎన్‌సీసీ మద్దతు

నీట్ పరీక్షలకు వ్యతిరేకతను ప్రకటించిన తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్‌పి అభినందిస్తున్నట్లు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన ఓ ప్రకటన వెల్లడించారు. విద్యార్థులకు నగదు కానుకల పంపిణీ సభలోనీట్‌పై తనకున్న అభిప్రాయాన్ని విజయ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పడం అభినందనీయమన్నారు. తమిళ ప్రజల చిరకాలపు కోరికగా ఉన్న నీట్ పరీక్షల రద్దు త్వరలోనే అమలులోకి రాగలదని విజయ్ ప్రసంగం తనకు నమ్మకాన్ని కలిగిస్తోందన్నారు.

దిల్లీ మున్సిపల్ కౌన్సిల్ సభ్యురాలిగా బాన్సూరి స్వరాజ్

న్యూదిల్లీ: న్యూదిల్లీ మున్సిపల్ కౌన్సిల్ (ఎన్‌డీఎంసీ) సభ్యురాలిగా బీజేపీ ఎంపీ బాన్సూరి స్వరాజ్‌ను నియమించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దివంగత బీజేపీ అగ్ర నాయకురాలు సుష్మా స్వరాజ్ కుమార్తె అయిన బాన్సూరి స్వరాజ్ లోక్‌సభ ఎన్నికల్లో న్యూదిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో కీలకమైన ఎన్‌డీఎంసీలో సభ్యురాలిగా కేంద్ర ప్రభుత్వం ఆమెను నియమించింది. కాగా, దిల్లీ మున్సిపాలిటీ సేవలు, పరిపాలనలో ఎన్‌డీఎంసీ సభ్యులు కీలక పాత్ర పోషిస్తారు. అర్బన్ ప్లానింగ్, భూ వినియోగం, జోనల్ నిబంధనలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ ప్రణాళికకు సంబంధించిన విధానాల రూపకల్పన, అమలుకు సభ్యులు సహకరిస్తారు. మరోవైపు ఆరోగ్య సదుపాయాలు, స్కూల్స్, నీటి సరఫరా, విద్యుత్, మురుగునీరు, వ్యర్థాల నిర్వహణ వంటి ప్రజా సేవల అమలు, నిర్వహణను పర్యవేక్షించే బాధ్యతలు కూడా ఎన్‌డీఎంసీ సభ్యులు నిర్వహిస్తారు.

పవిత్రా గౌడను నా భర్త పెళ్లి చేసుకోలేదు

పోలీసులకు దర్శన్ భార్య లేఖ

బెంగళూరు: తన అభిమాని రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన కన్నడ నటుడు దర్శన్, అతడి స్నేహితురాలు పవిత్రా గౌడ ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నారు. ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, విచారణ క్రమంలో పోలీసులు వీరిద్దరినీ దంపతులుగా పేర్కొనడంపై దర్శన్ భార్య విజయలక్ష్మి అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆమె నటుడి భార్య కాదంటూ బెంగళూరు పోలీసు కమిషనర్ బి.దయానందకు తాజాగా లేఖ రాశారు. 'ఇటీవల మీడియా సమావేశంలో పవిత్ర... దర్శన్ భార్య అంటూ మీరు తప్పుగా ప్రకటన చేశారు. ఆ తర్వాత కర్ణాటక హోంమంత్రి కూడా ఇదే మాట అన్నారు. ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ నటుడి దంపతులు అరెస్టయ్యారని ఆ మంత్రి చెప్పారు. ఆమె దర్శన్ భార్య కాదు. కేవలం నా భర్తకు స్నేహితురాలు మాత్రమే. దర్శన్‌కు చట్టపరమైన జీవిత భాగస్వామిని నేను ఒక్కదాన్ని మాత్రమే. 2003లో మా పెళ్లి జరిగింది. పోలీసు రికార్డుల్లోనూ మీరు ఆమె పేరును దర్శన్ సతీమణిగా పేర్కొనవద్దు. అది భవిష్యత్తులో నాకు, నా కుమారుడికి సమస్యలు తెచ్చిపెడుతుంది. పవిత్రకు సంజయ్‌సింగ్ అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ఓ కుమార్తె కూడా ఉంది. దయచేసి ఈ వాస్తవాలను రికార్డుల్లో స్పష్టంగా రాయండి' అని విజయలక్ష్మి తన లేఖలో అభ్యర్థించారు. విజయలక్ష్మితో వివాహమైనప్పటికీ దర్శన్ కొంతకాలంగా కన్నడ నటి పవిత్రతో సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే తమ బంధానికి పదేళ్లు అంటూ ఇటీవల నటి ఓ వీడియో పోస్ట్ చేసింది. దీంతో వీరి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ సంబంధం వల్ల విజయలక్ష్మికి అన్యాయం జరుగుతుందని బాధపడిన దర్శన్ అభిమాని రేణుకాస్వామి... పవిత్రకు అశ్లీల సందేశాలు, అసభ్య హెచ్చరికలు చేశాడని పోలీసులు గుర్తించారు. అదే అతడి హత్యకు దారితీసిందని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ సందేశాల గురించి దర్శన్‌కు చెప్పడంతో అతడు ఆగ్రహానికి గురై, రేణుకాస్వామిపై దాడి చేశాడని పవిత్ర విచారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈ కేసులో వీరిద్దరితో పాటు మరో 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరంతా కస్టడీలో ఉన్నారు.

దర్శన్, పవిత్ర గౌడకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

రేణుకాస్వామి హత్య కేసులో అరెస్టయిన కన్నడ నటుడు దర్శన్, నటి పవిత్ర గౌడ సహా పలువురు నిందితులకు ఈ నెల 18 వరకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ గురువారం కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. గతంలో విధించిన జ్యుడీషియల్ కస్టడీ ముగియడంతో దర్శన్, పవిత్రతో పాటు మొత్తం 17 మంది నిందితులను పోలీసులు బెంగళూరు, తుమకూరు జైళ్ల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా పైన పేర్కొన్న విధంగా జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

'హాత్రస్' దోషులను కఠినంగా శిక్షించాలి: సీపీఐ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హాత్రస్‌లో తొక్కిసలాట జరిగి 121 మంది ప్రాణాలు కోల్పోవడంపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) విచారం వ్యక్తంచేసింది. ఈ ఘటనపై జ్యుడిషియల్ విచారణను కోరింది. బాధితులకు సముచిత పరిహారం ఇవ్వాలని గురువారం ఒక ప్రకటనలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం డిమాండ్ చేసింది. 121 మంది మరణానికి కారణమైన బాబాను, కార్యక్రమం నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. చాలా ఏళ్లుగా మౌఢ్యాన్ని ప్రోత్సహిస్తుండటమే ఇలాంటి విపత్తులకు కారణమవుతున్నట్లు ప్రకటనలో వ్యాఖ్యానించింది.

సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు చర్యలు

సీఎం చంద్రబాబుకు రామకృష్ణ లేఖ



విశాలాంధ్ర–విజయవాడ: 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు తగు చర్యలు చేపట్టాలని కోరుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం లేఖ రాశారు. 10 ఏళ్లుగా కొందరు ఖైదీలు సత్ప్రవర్తనతో జీవిత శిక్ష అనుభవిస్తున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి శిక్షను అనుభవించిన ఖైదీలకు క్షమాభిక్ష కోసం వారి కుటుంబీకులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు గతంలో అనేక పర్యా యాలు ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించి, వారికి జీవితాన్నిచ్చారని... ఫలితంగా కొన్ని వందల ఖైదీల కుటుంబాలు బాగుపడ్డాయని గుర్తు చేశారు. 2020లో వైసీపీ ప్రభుత్వం ప్రసాదించిన క్షమాభిక్ష వందలమంది ఖైదీలను నిరాశ పరిచిందన్నారు. అనేక నిబంధనలు పెట్టి సామూహిక క్షమాభిక్ష పెట్టడం ద్వారా వందలాది ఖైదీలు విడుదలకు నోచుకోలేదన్నారు. 2024 ఆగస్టు 15న 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏడు సంవత్సరాల వాస్తవ శిక్షా కాలం, 3 సంవత్సరాల రెమిషన్ కలిపి 10 సంవత్సరాలు శిక్ష పూర్తి చేసుకున్న పురుష ఖైదీలకు అలాగే ఐదేళ్ల వాస్తవ శిక్షా కాలం, రెండేళ్ల రెమిషన్ కలిపి ఏడేళ్ల శిక్షాకాలం పూర్తి చేసుకున్న మహిళా ఖైదీలకు సామూహిక క్షమాభిక్ష ప్రసాదించి, విడుదల చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.

అన్నమయ్య ప్రాజెక్టుపై విచారణ

చంద్రబాబుకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర–విజయవాడ: అన్నమయ్య జిల్లా రాజంపేటలోని అన్నమయ్య ప్రాజెక్టు వరదకు కొట్టుకుపోవటంపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఇందుకు కారణమైన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని కోరుతూ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన ఒక లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి ఇసుక మాఫియా కారణమన్నారు. వరదలకు ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో 24 గ్రామాలు ముంపునకు గురైనట్లు తెలిపారు. 32 మంది చనిపోగా వందల మూగజీవాలు వరదలో కొట్టుకుపోయాయని గుర్తుచేశారు. ఇది 2021లో జరిగిందని, నేటికీ ముంపు గ్రామాలు కోలుకోలేదని వెల్లడించారు. అన్నమయ్య ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలలో కరువు తాండవిస్తోందని, బోర్లు అడుగంటి, వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకున్నదని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అదే వరదకు పింఛ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని తెలిపారు. అలాగే ఝురికోన ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని ముఖ్యమంత్రిని కోరారు. గతంలో ప్రారంభించిన సుండుపల్లి, వీరబల్లి రెండు మండలాల ప్రజల దాహార్తి తీర్చడానికి రోళ్లమడుగు నీటి పథకానికి నిధులు కేటాయించి, ఆ రెండు మండలాల ప్రజల దాహార్తిని తీర్చాలంటూ తన లేఖ ద్వారా ముఖ్యమంత్రిని ఈశ్వరయ్య కోరారు.

ధాన్యం బకాయి వెయ్యి కోట్లు విడుదల

- ప్రజా పంపిణీ వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం రైతుల బకాయిలు చెల్లింపు కోసం వెయ్యి కోట్లు విడుదలకు సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా గత ప్రభుత్వ హయాంలో కాకినాడ పోర్టు అడ్డాగా రేషన్ మాఫియా రాజ్యమేలిందని ఆరోపించారు. గత వారం రోజుల్లో రూ.159 కోట్ల విలువైన 35,404 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. పేదల పొట్ట కొట్టి... కోట్లు దోచుకున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వ్యవస్థ ప్రక్షాళన జరిగే వరకు తనిఖీలు చేస్తూనే ఉంటామని మంత్రి హెచ్చరించారు. ప్రతి జిల్లాలో తనిఖీలు చేపట్టి బియ్యం మాఫియాను నిర్మూలిస్తామన్నారు. గత అరాచక పాలనలో రైతులు చితికిపోయారని, రైతుల నుంచి సేకరించిన ఆహారధాన్యాలకు సకాలంలో బిల్లులు చెల్లించలేదన్నారు. విజయవాడలోని పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి గురువారం మీడియాతో మాట్లాడుతూ "ఐదేళ్ల గత దురాగత పాలనలో రైతులు అన్ని విధాలా చితికిపోయారు. పంట పండించి నలుగురికీ అన్నం పెట్టే రైతుని నిస్సహాయ స్థితిలోకి నెట్టేశారు. ఏటా కన్నీటితో బకాయిల కోసం ఎదురుచూపులు చూసే దుస్థితికి తెచ్చారు. రైతుల వద్ద కొన్న ఆహార ధాన్యాలకు చెల్లించాల్సిన మొత్తం పూర్తిగా బకాయిలు పెట్టి రైతు ధైర్యం కోల్పోయేలా చేశారు. మరోవైపు పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్‌ని రూ.36,300 కోట్ల అప్పుల పాలు చేశారు. అయినా రైతాంగానికి రూ.1,659 కోట్లు బకాయిలు కట్టకుండా వదిలేశారు. ఆహార భద్రత కల్పించే పౌరసరఫరాల శాఖను అప్పులపాలు చేశారు. రైతులను ఆదుకోవాల్సింది పోయి బకాయిలు వదిలేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలని కోరారు. రైతుల దగ్గర కొన్న ప్రతి ధాన్యపు గింజకు ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని మనోహర్ హామీ ఇచ్చారు.

అందుకే సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి రైతులను ఆదుకునేందుకు పెద్ద మనసుతో తొలి విడతగా రూ. వెయ్యి కోట్లు మంజూరు చేశారని, మిగిలిన బకాయిలు కూడా చెల్లిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థలో మరిన్ని మార్పులు తీసుకువస్తామని దోపిడీకి పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని మంత్రి హెచ్చరించారు.

పార్లమెంటు సాక్షిగా బీజేపీ అబద్ధాలు

లోక్‌సభ స్పీకర్‌కు కాంగ్రెస్ లేఖ



న్యూఢిల్లీ: గత పదేళ్లలో సుమారు 25కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చినట్లు ప్రధాని మోదీ పార్లమెంటుకు చెప్పడంలో నిజం లేదని కాంగ్రెస్ పేర్కొంది. బీజేపీ అధికారంలోకి రాక ముందు సాయుధ దళాల వద్ద సముచిత ఆయుధాలు లేవంటూ తప్పుడు ప్రకటనలు చేసినట్లు విమర్శించింది. పార్లమెంటు సాక్షిగా ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఒక లేఖ రాసింది. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ లోక్‌సభలో చెప్పిన అవాస్తవాలను ఎత్తి చూపింది. దిగువ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రసంగంపై అధికార పక్షం స్పందనకు దీటుగా కాంగ్రెస్ ఈ చర్య తీసుకుంది. బీజేపీ నోటీసు ఇవ్వడంతో రాహుల్ ప్రసంగంలోని కొన్ని భాగాలను రికార్డుల నుంచి తొలగించారు. బీజేపీ ఎంపీ బన్సూరి స్వరాజ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇచ్చిన నోటీసుపై ఓ సభ్యుడు స్పందిస్తూ 'చట్టసభలను తప్పుదోవ పట్టించాలనుకునే సభ్యులు ఎవరూ తప్పించుకోలేరు' అని అన్నారు. ఇదే క్రమంలో స్పీకర్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాకూర్ లేఖ రాశారు. 'సభ్యుడు చేసే ప్రకటనల్లో తప్పులను ఎత్తిచూపే ముందు దానిని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాలి. సభలో ప్రస్తావించేందుకు అనుమతి తీసుకోవాలి. ప్రధాని, అనురాగ్ ఠాకూర్ చేసిన తప్పుడు ప్రకటనలపై సముచిత చర్యలను కోరుతున్నా' అని ఠాకూర్ పేర్కొన్నారు. డైరెక్షన్ 115 (1)ను లేఖలో ప్రస్తావించారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాక ముందు వరకు భారత త్రివిధ దళాల వద్ద యుద్ధ విమానాలు, సముచిత ఆయుధాలు లేవని అనురాగ్ ఠాకూర్ తప్పుడు ప్రకటన చేసినట్లు స్పీకర్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటికే మన వద్ద జాగ్వార్, మిగ్ 29, ఎస్‌యూ–30, మిరేజ్ 2000 ఉన్నాయని, అణుబాంబు, అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్, బ్రహ్మోస్ వంటి క్షిపణలు ఉన్నాయని గుర్తుచేశారు. పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికంలో నుంచి బయటకు తెచ్చినట్లు మోదీ అబద్ధం చెప్పారన్నారు. 16 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓట్లవాట తగ్గినట్లు ప్రధాని తప్పుడు ప్రకటన చేశారని, వాస్తవానికి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, కర్నాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓట్లవాటా పెరిగిందని మాణికం ఠాకూర్ తెలిపారు. మహిళలకు ప్రతినెల రూ.8,500 ఇస్తామని కాంగ్రెస్ తప్పుడు హామీ ఇచ్చిందని మోదీ చెప్పారని... సార్వత్రిక ఎన్నికల్లో గెలిచి తమ ప్రభుత్వం ఏర్పాటైతే అలా చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని వివరించారు. ప్రతిపక్షం బలంగా ఉంది కాబట్టి బీజేపీ తప్పుడు వ్యాఖ్యలపై పార్లమెంటులో దుమారం తప్పబోదని స్పీకర్‌కు రాసిన లేఖలో మాణికం ఠాకూర్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి పార్లమెంటు ఉభయసభలు వాయిదా పడ్డాయి. రాజ్యసభలో ప్రధాని ప్రసంగాన్ని విపక్షాలు బహిష్కరించాయి. వాకౌట్ చేశాయి. కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంటు తిరిగి సమావేశం కానుంది. జులై మూడోవారంలో పార్లమెంటు సమావేశాలు జరుగుతాయని సమాచారం.

ఊపిరితీస్తున్న వాయు కాలుష్యం

భారత్‌లో ఏటా 33 వేల మరణాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ప్రతి ఏడాది 11.5 శాతం మరణాలు (దాదాపు 12,000 మంది) వాయు కాలుష్యం కారణంగా సంభ వించి ఉండొచ్చని ప్రముఖ వైద్య పరిశోధన మాసపత్రిక లాన్సెట్‌లో ప్రచురిత మైన ఓ నివేదిక అంచనా వేసింది. కాలుష్యం కారణంగా దేశంలో అత్యధిక మరణాలు సంభవిస్తుంది ఈ మహానగరంలోనేనని తెలి పింది. భారత్‌లో మొత్తం పది నగరాలు... అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ, హైదరా బాద్, కోల్‌కతా, ముంబై, పుణె, సిమ్లా, వారణాసిలో అధ్యయనం చేశారు. ఏటా ఈ నగరాల్లో దాదాపు 33 వేల మరణాలు వాయు కాలుష్యం కారణంగా సంభవించి ఉండొచ్చని నివేదిక తెలిపింది. సిమ్లాలో అత్యల్పంగా 59 మంది మరణించారు. అక్కడ సంభవిస్తున్న మరణాల్లో ఇది 3.7 శాతానికి సమానం. మొత్తం పది నగరాల్లో నమోదైన మరణాల్లో 7.2 శాతం కాలుష్యం వల్లేనని కుండబద్దలు కొట్టింది. భారత్ సహా విదేశీ పరిశోధకులు కలిసి ఈ అధ్యయనం చేశారు. పది నగరాల్లో పీఎం 2.5 కాలుష్య రేణువుల స్థాయి ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రామాణిక పరిమితులను మించాయని వెల్లడించింది. సంవత్సరంలో 99.8 శాతం రోజులు ఇదే పరిస్థితి ఉంటోందని తెలిపింది. 2008 నుంచి 2019 మధ్య పది నగరాల్లోని సివిల్ రిజిస్ట్రీల నుంచి మరణాల సమాచారాన్ని సేకరించారు. నగరాన్ని బట్టి మూడు నుంచి ఏడేళ్ల డేటా మాత్రమే వారికి లభిం చింది. మొత్తం 36 లక్షల మరణాలను అధ్యయనం చేశారు. మెషీన్ లెర్నింగ్ సాంకేతికతతో రూపొందించిన అత్యాధునిక పద్ధతుల ద్వారా పీఎం 2.5 రేణువుల స్థాయిలను అంచనా వేశారు. పీఎం 2.5 స్థాయిలు ప్రతీ క్యూబిక్ మీటరుకు 10 మైక్రోగ్రాములు పెరిగిన కొద్దీ మరణాలు 1.42 శాతం అధికమైనట్లు అధ్యయనం గుర్తించింది. పది నగరాల డేటాను కలిపినప్పుడు ఈ పరిస్థితి ఉందని తెలిపింది.

మహిళా ఉద్యమ నేత ప్రేమ పురవ్ కన్నుమూత

పూనె: స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక కార్యకర్త, అన్నపూర్ణ మహిళా మండలి వ్యవస్థాపకురాలు పద్మశ్రీ ప్రేమ పురవ్ (88) ఇక్కడ తుదిశ్వాసవిడిచారు. పుణ్యతిల్ వైకుంఠ శ్మశాన వాటికలో బుధవారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె కోరిక మేరకు అంత్యక్రియలు సందర్భంగా మతపరమైన ఎటువంటి కార్యక్రమం జరగలేదు. ప్రేమ పురవ్ మృతి పట్ల సామాజిక వర్గాల్లో విషాదం వ్యక్తమైంది. నిరుపేద మహిళలు, పిల్లల సాధికారత కోసం ఆమె చేసిన కృషి అనన్య సామాన్యమైంది. ప్రేమ పురవ్ 1935 ఆగస్టు 15న రోసీ గోవ్యత్ ఝలాలో జన్మించారు. తన 12 ఏళ్ల సోదరుడు కాశీనాథ్‌తో కలిసి ఆమె స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. తర్వాత గోవా ముక్తి సంగ్రామంలో పాల్గొన్నారు. అక్కడ కృష్ణ మాన్సే నుంచి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ముంబైకి వచ్చి కమ్యూనిస్ట్ పార్టీ కమ్యూన్‌కు కొంత కాలం పాటు పనిచేశారు. పురవ్ తో ప్రేమ తాయ్ వివాహం జరిగింది. దేశంలోనే అతిపెద్ద బ్యాంక్ ఉద్యోగుల యూనియన్ ఏఐబీఈఏకి పురవ్ వ్యవస్థాపక నాయకుడు. పదవీ విరమణ తర్వాత, దాదా పురవ్, ప్రేమ పురవ్ ఉమ్మడి మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. 1960 తర్వాత ప్రేమ పురవ్ భారతీయ జాతీయ మహిళా సమాఖ్య, గిర్ని వర్కర్స్ యూనియన్, మహాగై ప్రతికార్ సంయుక్త మహిళా సమితితో కలిసి పనిచేశారు. 1975లో దాదా పురవ్ మార్గదర్శకత్వంలో ప్రేమ పురవ్ అన్నపూర్ణ మహిళా మండలిని స్థాపించారు. ప్రారంభ కాలంలో, అన్నపూర్ణ మహిళా మండలి పేద మహిళలను బానిసత్వం నుంచి విముక్తి చేయడానికి కృషి చేసింది. బలహీన వర్గాలకు తక్కువ వడ్డీకి రుణాలు అందించే పథకం అమల్లోకి వచ్చింది. ఫుడ్ స్టాల్స్ నడుపుతున్న వేలాది మంది మహిళలు ఈ మహిళా మండలి ద్వారా లబ్ధి పొందారు.

సీపీఐ జాతీయ సమితి సంతాపం

ప్రేమ్ పురవ్ మృతి పట్ల సీపీఐ జాతీయ సమితి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్వాతంత్ర్యోద్యమంలో ఆమె కీలక పాత్ర వహించారని కొనియాడింది. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో, మహారాష్ట్ర రాష్ట్ర ఏర్పాటుకు జరిగిన పోరులోనూ ఆమె అద్వితీయమైన పాత్ర వహించారని పేర్కొన్నది. ఆమె గొప్ప నిర్వాహకురాలుగా సీపీఐ కొనియాడింది. ముంబై, నవి ముంబై, పూనెలోని అసంఘటితరంగ మహిళలు, స్వయం ఉపాధి మహిళల కోసం "అన్నపూర్ణ"పేరుతో ఆమె ఒక సంస్థను నడిపారని ఆ ప్రకటనలో గుర్తు చేసింది. ఆమె మృతి కమ్యూనిస్టు పార్టీకి, ప్రజా ఉద్యమాలకు, దేశానికి తీరనిలోటుగా ఆ ప్రకటనలో సీపీఐ పేర్కొంది.

కన్నుల పండువగా టీమిండియా విజయోత్సవం

ముంబై: ఐసీసీ ట్వంటీ20 క్రికెట్ ప్రపంచకప్‌ను గెల్చుకుని జగజ్జేతలుగా స్వదేశంలో అడుగుపెట్టిన టీమిండియాకు అపూర్వ స్వాగతం లభించింది. గురువారం ముంబై నగరంలో ఓపెన్ టాప్ బస్సులో విక్టరీ పరేడ్ కన్నుల పండువగా సాగింది. నగరంలోని నారీమన్ పాయింట్ నుంచి మొదైలన విజయయాత్రకు లక్షలాదిమంది అభిమానులు దారిపొడవునా నీరాజనాలు పలుకుతూ 'జయహో టీమిండియా' నినాదాలతో భారత క్రికెటర్లపై పూల వర్షం కురిపించారు. మువ్వన్నెల జెండాలు చేతబూని 'ఈ విజయం చారిత్రాత్మకం' అంటూ రోహిత్ సేన ఘనతను కీర్తించారు. అనుకున్న సమయం కంటే ఆలస్యంగా పరేడ్ మొదలైనా సరే... కొంచెం కూడా అలసట లేకుండా 'ఇండియా.. ఇండియా'.. 'కోహ్లీ.. కోహ్లీ'.. 'రోహిత్.. రోహిత్'.. నినాదాలతో హోరెత్తించారు. కాగా అభిమానుల మద్దతు, ప్రేమకు ఫిదా అయిపోయిన భారత ఆటగాళ్లు ప్రపంచ కప్ ట్రోఫీని చూపిస్తూ అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అరేబియా సముద్రపు ఒడ్డున లక్షల మంది చేరడంతో వాంఖడే స్టేడియం పరిసరాలు జనంతో కిక్కిరిసి పోయాయి. ఇసుకేస్తే రాలనంత మంది జనంతో భారీ భద్రత నడుమ టీమిండియా విజయోత్సవ ర్యాలీ వాంఖడే స్టేడియంకు చేరుకోగా... అక్కడ వేలాదిమంది అభిమానుల సమక్షంలో భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ప్రపంచకప్ విజేతలను ఘనంగా సత్కరించింది. ముందుగా ప్రకటించిన రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ చెక్ కూడా అందజేశారు. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, రవి శాస్త్రి, సునీల్ గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతో భేటీ

టీ20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం స్వదేశానికి చేరుకున్న రోహిత్ సేన... గురువారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ అయ్యింది. ప్రధాని నివాసంలో జరిగిన కార్యక్రమంలో మోదీకి బీసీసీఐ ప్రత్యేక బహుమతి అందించింది. 'నమో' నెంబర్ 1 పేరున్న ప్రత్యేక టీమిండియా జెర్సీని అందజేసింది. భారత ఆటగాళ్ల సమక్షంలో బీసీసీఐ సెక్రటరీ జైషా, అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఈ జెర్సీని మోదీకి ప్రదానం చేశారు. ప్రధాని మోదీతో భేటీ అనంతరం టీమిండియా ఆటగాళ్లు ముంబైకి బయల్దేరి వెళ్లారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.